RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 25 జూలై 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:49

## ఎన్‌టీఏలో ప్రక్షాళన..

## 47 మంది అధికారులపై వేటు

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రక్షాళన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సంస్థ విశ్వసనీయతను పునరుద్ధరించే లక్ష్యంతో ఎన్‌టీఏలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే సుమారు 47 మంది అధికారులను విధుల నుంచి తొలగించింది.

రాబోయే నెల రోజుల్లో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికానున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో భవిష్యత్తులో ఎలాంటి లీకేజీలకు, అవకతవకలకు తావులేకుండా అత్యంత పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే తొలగించిన 47 మంది అధికారులతో పాటు, మరికొందరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానాన్ని కూడా పూర్తిగా మార్చాలని, అంతర్గత నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని భావిస్తోంది.

ఈ ఏడాది జరిగిన నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలు, పార్లమెంటులో విపక్షాల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో సుమారు 22 లక్షల మంది విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. పరీక్షల నిర్వహణ వ్యవస్థను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ప్రస్తుతం ఈ చర్యలు చేపడుతోంది. తాజా మార్పులు కేవలం స్వల్ప సర్దుబాట్లు కాదని, వ్యవస్థను సమూలంగా మార్చే 'ఫండమెంటల్ రీసెట్' అని అధి,కారులు స్పష్టం చేస్తున్నారు. నీట్, జేఈఈ మెయిన్, సీయూఈటీ వంటి 15 నుంచి 20 కీలక జాతీయ స్థాయి పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే ఈ ప్రవేశ పరీక్షల పవిత్రతను కాపాడటమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం.

## హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం.



3 లో

## సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. ?రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని ఆయన అన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిది. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు.

మిగతా 2 లో

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే 'నీట్'పై చర్చ: రాహుల్ గాంధీ



నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు లోక్‌సభలో ఎలాంటి చర్చకూ ఒప్పుకునేది లేదని విపక్ష నేత (ఎల్‌ఓపీ) రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించాకే తదుపరి సంభాషణ ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ వాయిదా పడిన కాసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకుముందు, పేపర్ లీకేజీల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభలో ప్రకటించారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు తెస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, రాహుల్ గాంధీ చర్చకు సహకరించాలని రిజిజు కోరారు.

అనంతరం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తన మైక్‌ను లాగేసుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల తరఫున విపక్షాలు మూడు ప్రధాన డిమాండ్లు చేస్తున్నాయని ఆయన పునరుద్ఘాటించారు. అవి:

1. "అవినీతిపరుడైన" విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.
2. నిరసన చేస్తున్న విద్యార్థులపై దాడి చేసి, కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి.
3. విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలి.

"ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించే వరకు మేం ఎలాంటి చర్చలు జరపబోం," అని రాహుల్ దృఢంగా చెప్పారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి నీట్-యూజీ పరీక్ష పత్రాల లీకేజీ అంశం పార్లమెంటును కుదిపేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కొత్త చట్టం తెచ్చామని చెబుతున్నప్పటికీ, మంత్రి రాజీనామా చేయాల్సిందేనని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ వివాదంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది.

## విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో ఆయా సంస్థల యాజమాన్యాలను కూడా బాధ్యులను చేయాలి : రేవంత్ రెడ్డి

వార్తా 2 లో

## భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం

### బీటీపీఎస్ ప్లాంట్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



చంద్రుగొండ / మణుగూరు జూలై 24 ప్రజాబలం ప్రతినిధి :-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్) ఆవరణలో నూతనంగా నిర్మించిన డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు , వైరా శాసనసభ్యులు రాందాసు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యతో పాటు నాణ్యమైన విద్యను అందించే ఆధునిక విద్యాసంస్థల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు అత్యుత్తమ విద్యను అందించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు పాఠశాల భవనం, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, ఇతర ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, లక్ష్యాల గురించి తెలుసుకుని అభినందించారు. పాఠశాల యాజమాన్యం చేపట్టిన ఏర్పాట్లను ప్రశంసిస్తూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎమ్మెల్యేలతో కలిసి బీటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ రాష్ట్ర విద్యుత్ అవసరాల తీర్చడంలో బీటీపీఎస్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.




ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీటీపీఎస్ ఉన్నతాధికారులు, డీఏవీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రవాణా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసే బ్యూరోకు సంస్థాగత నిర్మాణం ఉండాలని చెప్పారు.

ముఖ్యమంత్రి తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రతీ 2 లేదా 3 నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని ఈ సందర్భంగా అధికారులకు చెప్పారు.

ట్రాఫిక్ వ్యవస్థలో నిబంధనలకన్నా క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలని, వాతావరణంలో వచ్చే మార్పులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం జరగాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలని, ఓఆర్‌ఆర్ పై ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు.

హైదరాబాద్ నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించాల్సిన అవసరం ఉందని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి , కె. రామకృష్ణారావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాబలం

25 జూలై 2026 శనివారం

# కాంగ్రెస్ పార్టీకి నీట్ బూస్ట్

జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.'దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతు

**రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరించాలి**

**సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం**

**బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి విస్తరించాలి**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

మొదటి పేజీ తరువాయి

గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని ఆ న్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీనితో ప్రభుత్వరంవ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.

సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని అన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో బ్లెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి.. వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేక పోయిందని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.

ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని అన్నారు. సింగరేణి అనేది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని, మైన్ స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో ఓపెన్ చర్చలు ప్రారంభించాలని ఆన్నారు. సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు.

రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం విపరీతంగా మారబోతోందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ ఆధారిత బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇవి పెరిగితే థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని అధికారులకు సూచనలు చేశారు.

సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు.

ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే 10 ఏళ్ల రోడ్‌మాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరిగా టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# ధర్నా చౌక్ లో ముక్కు నెలకు రాసి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

**ధర్నా చౌక్ ను ఎత్తి వేసిన చరిత్ర బిఆర్ఎర్టీ**

**చరిత్ర బిఆర్ఎస్ పార్టీది**

**అలాంటి ధర్నా చౌక్ లో ధర్నా చేసే హక్కు కేటీఆర్ కి ఎక్కడిది**

**టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్**




హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైద్రాబాద్ జులై 24 : ధర్నా చౌక్ ఎత్తేసిన చరిత్ర బిఆర్ ఎస్ పార్టీదని అలాంటి పార్టీ కి ధర్నా చౌక్ లో ధర్నా చేసే హక్కు కేటీఆర్ కి ఎక్కడిదనిటీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం గాంధీ భవన్ లో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి తో కలిసి మీడియా సమావేశం లో మాట్లాడారు. ధర్నా చౌక్ లో ముక్కు నెలకు రాసి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నా చౌక్ లో ఏ విధముగా ధర్నా చేస్తున్నారో కేటీఆర్ అర్థం చేసుకోవాలి

ఈ వయసులో మల్లికార్జున ఖర్గే విద్యార్థుల పక్షాన పోరాడుతుంటే..మీ అయ్యా కేసిఆర్ ఫామ్ హౌస్ కి పరిమితమయ్యారని

ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎందుకు ఢిల్లీ కి వెళ్లలేదు? అని ప్రశ్నించారు.

సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ లో నిరసనలో పాల్గొన్నారు

బిఆర్ ఎస్ పాపాల చిట్టా పెద్దది

గ్లోబారిన సంస్థ ఆ నాడు ఇంటర్మీడియట్ విద్యార్థుల చావుకు కారణం అయ్యింది

20 పైగా విద్యార్థులు ప్రాణాలు పోవడానికి గ్లోబరిన సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు.

గ్లోబరిన సంస్థ రిపోర్టును బిఆర్ ఎస్ ఎందుకు బయటపెట్టలేదు?

గ్లోబరిన సంస్థ పేరు మార్చుకొని విద్యార్థుల జీవితంతో ఆటలు ఆడుతోందని దుయ్య బట్టారు.

గ్లోబరినా లో కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ హయం లో లీకుల పర్వం సాగింది

14 వందల కోట్లు బిఆర్ ఎస్ ఖాతాలో మూలుగుతున్నాయి

అందులోనుంచి చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయండి

మే 12 నీట్ పరీక్ష లీక్ అయితే కేటీఆర్ ఇప్పుడు మొద్దు నిద్ర లేచాడు

రాహుల్ గాంధీకి మైలేజ్ వస్తుందని మోడీ తో కుట్ర పన్ని కేటీఆర్ బట్ట కాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

బిఆర్ఎస్ డ్రామాలో విద్యార్థులు భాగం కావొద్దని మహేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

బిఆర్ ఎస్ హయంలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు

గ్రూప్ 1 పరీక్షలు సైతం లీకుల పర్వం

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ కి కర్ర కాల్చి వాత పెట్టారు. సున్నా సీట్లకు పరిమితం చేశారు

విద్యార్థులకు న్యాయం కోసం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు?

మొద్దు నిద్రలేచి నల్ల చొక్కాలు వేసుకొని ధర్నా అంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

# విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో ఆయా సంస్థల యాజమాన్యాలను కూడా బాధ్యులను చేయాలి : రేవంత్ రెడ్డి




విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో ఆయా సంస్థల యాజమాన్యాలను కూడా బాధ్యులను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. క్యాంపస్‌లలో జరిగే డ్రగ్స్ సంబంధిత ఘటనలకు యాజమాన్యాలు బాధ్యత వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై సమీక్షించిన ముఖ్యమంత్రి గారు నిబంధనలను కఠినతరం చేయడం, అవసరమైతే ప్రత్యేక చట్టం రూపకల్పనపై అధ్యయనం చేయాలని సూచించారు.

విద్యా సంస్థల్లో టోల్‌ఫ్రీ నెంబర్, క్యూఆర్ కోడ్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం, విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించే ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. డ్రగ్స్ గుర్తింపు, డీ-అడిక్షన్, కౌన్సిలింగ్, పునరావృత నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి సుదర్శన్ రెడ్డి , కె రామకృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

# హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం.

**జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలి**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**ఇండ్ల నిర్మాణ స్థలం వ్యయం ప్రభుత్వమే భరిస్తుంది.**
**సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగిలేటి, పొన్నం ప్రభాకర్.**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 24 ప్రజాబలం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం కోర్ అర్బన్ ఏరియాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గురించి గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇల్లు క్యూర్ పరిధిలోనే ఉండాలని అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు తెలియజేశారు.



పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాల గురించి అధికారులు ముఖ్యమంత్రి కి వివరించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖలకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు.

జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలని చెప్పారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు.

క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు.

ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు 11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో 5 లక్షల మేరకు సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన 6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది.

తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7, 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది.

ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# పట్టు కోసం కమలం బిగ్ ప్లాన్

హైదరాబాద్, జూలై 24, తెలంగాణ రాజకీయ వేదికపై అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అధిష్టానం అత్యంత వేగంగా పావులు కదుపుతోంది. సాంప్రదాయ రాజకీయ శైలికి భిన్నంగా, పూర్తిగా డేటా ఆధారిత కార్పొరేట్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా ఆపరేషన్ సాఫ్రాన్ పేరుతో ప్రొఫెషనల్ ఎలక్షన్ ఏజెన్సీలను క్షేత్రస్థాయిలోకి దించనుంది. రాబోయే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే ముమ్మరంగా గ్రౌండ్ వర్క్ ప్రారంభించింది.గత అనుభవాలు, ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన బీజేపీ హైకమాండ్, ఈసారి ముగ్గురు కీలక నేతల మార్గదర్శకంలో మూడు ప్రత్యేక ప్రొఫెషనల్ ఏజెన్సీలను రంగంలోకి దించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఇందులో మొదటిది అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్. హోంమంత్రి అమిత్ షా నేరుగా పర్యవేక్షించే ఈ సంస్థ, గత కొన్ని నెలలుగా తెలంగాణలో పార్టీ పొలిటికల్ ఎజెండా, ప్రచార వ్యూహాలను నిశితంగా రూపొందిస్తోంది. ఇక రెండోది జార్విస్. సాంకేతికత, కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఈ ఏజెన్సీ దృష్టి సారించింది. భారీ కాల్ సెంటర్ల నిర్వహణ ద్వారా నియోజకవర్గాల్లోని ఓటర్లను నేరుగా సంప్రదించడం, ప్రజల అభిప్రాయాలను సమీకరించడం, బూత్ కమిటీల పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను చూస్తోంది. అంతేకాకుండా పార్టీ కార్యకర్తలు, నాయకుల నిర్వహణ కోసం రూపొందించిన 'సరళ్ యాప్' బాధ్యతలను కూడా జార్విస్ సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఇక మూడోది అభీష్ట టీమ్. పశ్చిమ బెంగాల్, బిహార్ ఎన్నికలలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించి, మెరుగైన ఫలితాలను అందించిన 'అభీష్ట' ప్రొఫెషనల్ ఏజెన్సీని తాజాగా తెలంగాణకు రప్పించారు. ఈ టీమ్ బి.ఎల్.సంతోష్ పర్యవేక్షణలో బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు లోతైన అధ్యయనం చేస్తోంది.క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు 'అభీష్ట' బృందం ప్రస్తుతం 'సర్' అంటే స్టడీ, అండర్ స్టాండ్, రిపోర్ట్ ప్రక్రియను చేపట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణం ఏ విధంగా ఉంది? బూత్ లెవెల్ ఏజెంట్లు సరిగ్గా పనిచేస్తున్నారా? అనే అంశాలపై నివేదికలను ఎప్పటికప్పుడు ఢిల్లీ అధిష్టానానికి అందిస్తోంది.ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపును ప్రభావితం చేయగల 50 నుంచి 100 మంది ప్రముఖ వ్యక్తుల జాబితాను ఈ టీమ్ సిద్ధం చేస్తోంది. ఇందులో రాజకీయ నేతలతో పాటు సమాజంలో మంచి పేరున్న వ్యాపారవేత్తలు, మేధావులు, సామాజిక వేత్తలు, ప్రజాదరణ ఉన్న వ్యక్తులను గుర్తిస్తున్నారు. వీరిని పార్టీ వైపు ఆకర్షించడం లేదా పార్టీ విజయంలో వీరి మద్దతును వినియోగించుకోవడంపై ప్రణాళికలు రచిస్తున్నారు.కేవలం కేంద్ర నాయకత్వపు నివేదికలపైనే ఆధారపడకుండా, ఈ ఏజెన్సీలకు లోకల్‌గా అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి బీజేపీ, దాని అనుబంధ సంఘాల నుంచి శిక్షణ పొందిన వాలంటీర్లను నియమించారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పక్కాగా అసెస్ చేసి, దానిని ఓట్లుగా మార్చుకునేందుకు స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇతర పార్టీలలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నాయకులను చేర్చుకోవడంలోనూ ఈ ఏజెన్సీల గ్రౌండ్ రిపోర్టులు మార్గదర్శకంగా నిలవనున్నాయి.మొదటగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఓటర్ల నాడిని పట్టుకుని, అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార సరళి వరకు బ్యాక్ ఎండ్ నుంచి నడిపించేందుకు సిద్ధమయ్యారు. కేవలం స్థానిక నాయకత్వ బలంపైనే ఆధారపడకుండా, ఇటువంటి ఆధునిక డేటా విశ్లేషణ, కార్పొరేట్ తరహా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ పద్ధతులు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయో వేచి చూడాలి.

# ఎంబీటీకి కాంగ్రెస్ సపోర్ట్...

హైదరాబాద్, జూలై 24, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో భాగ్యనగర రాజకీయాలు, ముఖ్యంగా పాతబస్తీ వేదికగా సరికొత్త మలుపు తిరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీకి తిరుగులేని కోటగా ఉన్న పాతబస్తీలో ఈసారి మునుపెన్నడూ లేని విధంగా ఒక ఆసక్తికరమైన పొలిటికల్ ఈక్వేషన్ తెరపైకి వచ్చింది. ఎంఐఎంను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక మజ్లిస్ బచావో తెహ్రీక్ తో చేతులు కలిపి ఉమ్మడి కూటమిగా బరిలోకి దిగే ప్రయత్నాలు చేస్తోంది. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపల్ డివిజన్లు ఎప్పుడూ ఎంఐఎంకు ఏకపక్ష విజయాలను అందిస్తూ వచ్చాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి పాతబస్తీని నామమాత్రంగా వదిలేయడానికి సిద్ధంగా లేదు. ఎంఐఎం వ్యతిరేక ఓటు బ్యాంకును చీల్చకుండా, పాతబస్తీ గల్లీల్లో బలమైన క్యాడర్ ఉన్న ఎంబీటీ తో అధికారిక లేదా అనధికారిక అవగాహనకు వచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. బహదూర్‌పురా, యాకుత్‌పురా వంటి డివిజన్లలో ముస్లిం మైనారిటీ ఓటర్ల విభజనను నిరోధించి, ఉమ్మడి అభ్యర్థులను రంగంలోకి దించడం ద్వారా ఎంఐఎంకు చమటలు పట్టించాలని కాంగ్రెస్ స్థానిక నాయకత్వం భావిస్తోంది.పాతబస్తీలో ఎంఐఎంకు సైద్ధాంతికంగా, రాజకీయంగా గట్టి పోటీ ఇచ్చే ఏకైక స్థానిక శక్తి 'మజ్లిస్ బచావో తెహ్రీక్' . అమన్ నగర్, యాకుత్‌పురా, చంచల్‌గూడ వంటి పాకెట్స్‌లో ఎంబీటీకి ఇరవై ముప్పై ఏళ్లుగా చెక్కుచెదరని వాలంటీర్ నెట్‌వర్క్ ఉంది. కాంగ్రెస్ పార్టీకి పాతబస్తీలో నాయకత్వం ఉన్నప్పటికీ, గల్లీ స్థాయి బూత్ మేనేజ్‌మెంట్ బలహీనంగా ఉండేది. ఇప్పుడు ఎంబీటీ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ తనతో కలుపుకోవడం ద్వారా, ఎంఐఎం కోటలోని లూప్‌హోల్స్‌ను సులభంగా టార్గెట్ చేయగలుగుతోంది. ముఖ్యంగా మైనారిటీలలోని మతపరమైన సెంటిమెంట్ల కంటే, స్థానిక సమస్యలపై ఎంబీటీ చేసే పోరాటాలు కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో మైలేజ్ ఇస్తున్నాయి.ఈసారి పాతబస్తీ ఎన్నికల సరళిలో కనిపిస్తున్న అతిపెద్ద మార్పు.. అక్కడి యువత ఆలోచనా విధానం. దశాబ్దాలుగా కేవలం భావోద్వేగాలు, మతపరమైన సెంటిమెంట్ల ఆధారంగానే పాతబస్తీలో ఓటింగ్ జరుగుతూ వచ్చింది. కానీ, చదువుకున్న నేటి తరం యువత మా గల్లీ పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తోంది. నిరంతరం పొంగిపొర్లే డ్రైనేజీలు, కలుషిత తాగునీటి సరఫరా, వర్షం వస్తే మునిగిపోయే రోడ్లు, ఉపాధి అవకాశాల లేమి వంటి మౌలిక సమస్యలపై యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది.

ఐటీ కారిడార్ ఉన్న హైటెక్ సిటీ అభివృద్ధిని, తమ పాతబస్తీ వెనుకబాటుతనాన్ని పోల్చి చూసుకుంటున్న యువత.. ఈసారి మార్పు వైపు మొగ్గు చూపే సంకేతాలు గల్లీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కార్వాన్, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని కొన్ని డివిజన్లలో దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు నోచుకోలేదు. తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి లైన్లు కలిసిపోయి కలుషిత నీరు వస్తోందని స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పౌర సమస్యలనే కాంగ్రెస్-ఎంబీటీ కూటమి తమ ప్రధాన ఎన్నికల అస్త్రాలుగా మలచుకుంది. అధికారంలో ఉన్నందున తాము గెలిస్తేనే పాతబస్తీ డెవలప్‌మెంట్‌కు నిధులు వస్తాయనే డబుల్ ఇంజన్ కార్డ్‌ను కాంగ్రెస్ బలంగా వాడనుంది.ఈ ఉమ్మడి దాడిని ఎంఐఎం అధినాయకత్వం కూడా తేలిగ్గా తీసుకోవడం లేదు. అసంతృప్తిగా ఉన్న డివిజన్లలో సిట్టింగ్ కార్పొరేటర్లను మార్చడం, యువతకు కొత్తగా టికెట్లు కేటాయించడం ద్వారా యాంటీ-ఇంకంబెన్సీని తగ్గించుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ వ్యూహాలు రచిస్తున్నారు. తాము లేకపోతే పాతబస్తీలో ముస్లింల రాజకీయ అస్తిత్వం ప్రమాదంలో పడుతుందనే పాత సెంటిమెంట్‌ను మళ్లీ తెరపైకి తెస్తున్నారు. అయితే, గతంలో లాగా కాకుండా ఈసారి ప్రతి గల్లీలోనూ కాంగ్రెస్-ఎంబీటీ కూటమి గట్టిగా ఎదురుతిరుగుతుండటంతో, ఎంఐఎం తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి మునుపటి కంటే ఎక్కువ శ్రమించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలం, ఎంబీటీ లోకల్ క్యాడర్, యువతలో ఉన్న సివిక్ అసంతృప్తి.. ఈ మూడు కలిస్తే ఎంఐఎం అజేయ శక్తేమీ కాదని నిరూపించే అవకాశం ఉంది.

ఎంఐఎం తన కోటను కాపాడుకుంటుందా లేక కాంగ్రెస్-ఎంబీటీ కూటమి పాతబస్తీ గల్లీల్లో కొత్త చరిత్ర లిఖిస్తుందా అనేది రాబోయే రోజుల్లో జరిగే హైవోల్టేజ్ పోలింగ్ తేల్చనుంది. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా.. తీవ్ర పోరు ఖాయమని అనుకోవచ్చు.

## మంగళగిరిలో కుంకీ ఏనుగులకు డిప్యూటీ సీఎం పవన్ స్వాగతం

మంగళగిరి విజయనగరం, మన్యం జిల్లాల్లో పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగుల గుంపుని కట్టడి చేసేందుకు కుంకీ ఏనుగుల్ని పంపిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పలమనేరు నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తున్న కుంకీ ఏనుగులకు మంగళగిరి క్యాంపు కార్యాలయం వద్ద పవన్ స్వాగతం పలికారు. కుంకీ ఏనుగులకి చెరుకు గెడల్ని ఆహారంగా అందించారు. కుంకీలు జయంత్, అభిమన్యుకు పూలమాలలు వేశారు. ఈ రెండు కుంకీలను పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపునకు తరలిస్తారు.

# మెదక్ కే పరిమితమౌతున్నహరీష్ పార్టీలో రసవత్తరంగా చర్చ



మెదక్, జూలై 24, హరీష్ రావు సొంత నియోజకవకర్గం సిద్ధిపేటలో చేసిన పాదయాత్ర ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం పదిహేను కిలోమీటర్లు చేసిన పాదయాత్రతో రాష్ట్రం మొత్తం చూపు తన వైపునకు తిప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, పక్కా మాస్ లీడర్‌గా తన్నీరు హరీష్ రావుకు ఉన్న క్రేజ్, క్యాడర్ బేస్ ప్రత్యేకం. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు పార్టీకి ఏ కష్టం వచ్చినా ముందు వరుసలో నిలబడి పరిష్కరించడం ఆయన శైలి. తాను ఎప్పుడూ ఉన్నత పదవులకో, ఆధిపత్యానికో ఆశపడలేదని, అధినాయకత్వపు నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఆయన ఎన్నో సార్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణులను బలహీనపరచడానికి, అధినాయకత్వానికి-హరీష్‌రావుకు మధ్య అనుమానాల బీజాలు నాటడానికి ప్రత్యర్థి వర్గాలు నిరంతరం విచిత్రమైన ఊహాగానాలను సృష్టిస్తూనే ఉంటాయి. ఈ రాజకీయ సమీకరణల వల్లే కావచ్చు.. ప్రస్తుతం హరీష్ రావు పాత్రను అధినాయకత్వం కేవలం తన సొంత నియోజకవర్గానికో, ఉమ్మడి మెదక్ జిల్లాకో పరిమితం చేస్తోంది.రాజకీయాల్లో క్షేత్రస్థాయి బలం ఉన్న నాయకుడి పవర్ ఏంటో హరీష్ రావు ఇటీవలి తన సిద్దిపేట పాదయాత్రల ద్వారా మరోసారి నిరూపించారు. కాళేశ్వరం నీళ్లు, రైతాంగ సమస్యలపై ఆయన కేవలం ఒక మండల స్థాయిలో పిలుపునిస్తేనే వేలాదిగా జనం తరలివచ్చారు. ఏ మీడియా బిల్డప్‌లు, సోషల్ మీడియా ప్రచారాలు లేకుండా నేరుగా ప్రజలతో ఉండే ఈ లైవ్ కనెక్టివిటీ యే ఆయన అసలైన బలం. సోషల్ మీడియా హడావుడికే పరిమితమైన నేతల మధ్య, రోడ్డెక్కి పోరాటం చేసే మాస్ లీడర్‌గా ఆయనకున్న గుర్తింపు చెక్కుచెదరలేదు. అయితే, ఈ స్థాయి క్రేజ్ చూసిన ప్రతిసారీ సొంత పార్టీలోనే కొందరు వ్యతిరేకులు ఆయనపై ముద్రలు వేయడం, ఆయన సైలెంట్ అయితే పార్టీపై అలిగారని ప్రత్యర్థులు ప్రచారం చేయడం ఒక పరిపాటిగా మారింది.బీఆర్ఎస్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పునర్వైభవం కోసం పోరాడుతున్న తరుణంలో, హరీష్ రావు సేవలను కేవలం ఒక జిల్లాకే పరిమితం చేయడం వ్యూహాత్మక తప్పిదమేనని భావిస్తున్నారు. హరీష్ రావుకు ఎలాంటి సరిహద్దు ఆంక్షలు విధించకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు అప్పగిస్తే బీఆర్ఎస్ క్యాడర్‌లో వచ్చే ఊపు అసాధారణంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయడంలో గానీ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమాయత్తం చేయడంలో గానీ హరీష్‌కున్న రాజకీయ చాకచక్యం అపారమైనది.కానీ, ఈ నిర్ణయం తీసుకోవడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం వెనుకంజ వేయడానికి అంతర్గత కుటుంబ, వారసత్వ రాజకీయ సమీకరణలే ప్రధాన కారణమని అందరికీ తెలుసు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నందున , హరీష్ రావు మాస్ ఇమేజ్ దాన్ని డామినేట్ చేస్తుందేమోననే ముందస్తు ఆందోళనలు, భయాలు ఉండవచ్చు. వారి అంతర్గత ప్రాధాన్యతలు ఏవైనప్పటికీ, అధికారంలో లేని సమయంలో పార్టీకి అత్యంత అవసరమైన అస్త్రాన్ని సిద్ధంగా పెట్టుకుని పూర్తిస్థాయిలో వాడుకోకపోవడం గులాబీ దళానికి తీవ్ర నష్టం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవాలన్నా, కిందిస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలన్నా హరీష్ రావుకు స్వేచ్ఛాయుతమైన రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి, పక్కా వ్యూహాలు రచించే నైపుణ్యం ఉన్న నాయకుడికి పరిమితులు విధించడం వల్ల పార్టీ తన సొంత బలాన్నే తగ్గించుకున్నట్లవుతోంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం ధైర్యం చేసి, హరీష్ రావును రాష్ట్రవ్యాప్త పర్యటనలకు, పోరాటాలకు నాయకత్వం వహించేలా ముందువరుసలో నిలబడితేనే.. తెలంగాణలో గులాబీ జెండా మళ్లీ పూర్తిస్థాయిలో ఊపందుకుంటుంది.

# తల్లికి వందనం'తో ఆర్థిక ఊరట

రంపచోడవరం, జూలై 24 కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతిబిడ్డకు ఆర్థిక సాయం అందుతుండటంతో తమకు విద్యా ఖర్చుల భారం గణనీయంగా తగ్గిందని గిరిజన మహిళలు అన్నారు. ఈ పథకం తమ పిల్లల చదువుకు ఎంతో అండగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం పోలవరం జిల్లా రంపచోడవరంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రికి ఆదివాసీ మహిళలు సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సరస్వతి దేవికి పూలమాల సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

'తల్లికి వందనం' లబ్ధిదారులతో ఆత్మీయ సంభాషణ'

తల్లికి వందనం' పథకం లబ్ధిదారులైన గిరిజన మహిళలతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధనా ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయని తెలిపారు. పాఠశాలల్లో మంచి విద్యా వాతావరణం నెలకొల్పడంతో పాటు పరిశుభ్రమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని వివరించారు.

# మారని ట్రంప్...

# భారత్ పై మళ్లీ టారిఫ్



న్యూఢిల్లీ, జూలై 24,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా మరో 16 దేశాలపై కొత్త అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన ఉత్పత్తుల దిగుమతులపై నిషేధం అమలుకు సంబంధించిన విచారణ అనంతరం అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. భారత్ ఇప్పటికే విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించినందుకు 12.5 శాతానికి బదులుగా 10 శాతం టారిఫ్స్ మాత్రమే విధించింది.భారత్– అమెరికా మధ్య ఒకవైపు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. అమెరికా మధ్యలోనే ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. భారత్ సహా మరో 16 దేశాల నుంచి దిగుమతి అయ్యే కొన్ని ఉత్పత్తులపై 10 శాతం అదనపు సుంకాల్ని విధిస్తున్నట్లు ప్రకటించింది. కార్మికుల బలవంతపు శ్రమతో (వెట్టిచాకిరి) తయారైన ఉత్పత్తుల దిగుమతుల్ని అడ్డుకునే నిబంధనల అమలుపై జరిపిన విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ వెల్లడించింది. ఈ సుంకాల గురించి యూఎస్ ప్రెసిడెంట్ ఎప్పటి నుంచో బెదిరిస్తూ వస్తుండగా తాజాగా వాటిని అమల్లోకి తెచ్చారు.అమెరికా ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింది విచారణ చేపట్టింది. కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన వస్తువుల దిగుమతుల్ని నిషేధించే చట్టాల్ని ఆయా చట్టాలు అమలు చేస్తున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించింది. విచారణ అనంతరం నిషేధ నిబంధనలు అమలు చేసిన లేదా చేస్తామని హామీ ఇచ్చిన దేశాలకు 10 శాతం, అలాంటి చర్యలు తీసుకోని దేశాలకు 12.5 శాతం సుంకాల్ని విధించాలని నిర్ణయించింది.జూన్ 14న భారత్ తన విదేశీ వాణిజ్య విధానంలో మార్పులు చేసింది. కార్మికుల బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతుల్ని నిషేధించే నిబంధనల్ని చేర్చింది. దీంతో అమెరికా మొదట ప్రతిపాదించిన 12.5 శాతం అదనపు సుంకాలకు బదులు భారత్‌పై తగ్గించి 10 శాతం విధించింది. భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కంబోడియా, యూకే ఇలా మొత్తం 17 దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు అమలు చేయనున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై తొలి దశ చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్‌తో సమావేశమయ్యారు. ఒప్పందానికి సంబంధించి ప్రాథమిక రూపురేఖలు ఇప్పటికే ఖరారైనట్లు సమాచారం. వీలైనంత త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.'కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన వస్తువులపై చర్యలు తీసుకుంటున్న దేశాల్ని స్వాగతిస్తున్నామని' యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ చెప్పారు. ఈ చర్యల ద్వారా మానవ హక్కుల పరిరక్షణతో పాటు అంతర్జాతీయ వాణిజ్యంలో సమాన అవకాశాలు కల్పించాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం విధించిన అదనపు టారిఫ్స్ 10 శాతానికి పరిమితమైనప్పటికీ అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే కొన్ని రంగాలపై అదనపు వ్యయభారం పడే అవకాశం ఉంది. ఇప్పటికే సుంకాలు అమల్లో ఉండగా.. ఎంపిక చేసిన వస్తువులపై ఈ అదనపు సుంకాల భారం పడనుంది. అయితే వాణిజ్య ఒప్పందం కుదిరితే భవిష్యత్తులో ఈ సుంకాల భారం తప్పే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# బుల్లెట్ ట్రైన్ కోసం టెండర్లు

న్యూఢిల్లీ, జూలై 24,మూడో బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగు పడింది. చెన్నై– బెంగళూరు మధ్య మొత్తం 306.2 కిలోమీటర్ల పొడవైన హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణానికి ముందు జరగాల్సిన పనుల కోసం టెండర్లను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ కారిడార్‌లో ప్రస్తుతం ఎనిమిది స్టేషన్లు ఉండగా.. తమిళనాడులోని చెన్నై సెంట్రల్, పూందమల్లి, పరందూర్, అరక్కోణం.. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు.. కర్ణాటకలోని కోలారు, కొడినహళ్లి, వైట్‌ఫీల్డ్, బైయప్పనహళ్లి. నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ తన సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పరందూర్‌ను కూడా ఓ స్టేషన్‌గా ప్రతిపాదించింది. తాజాగా టెండర్ నోటిఫికేషన్‌లో పరందూర్‌ను భవిష్యత్తు స్టేషన్‌గా గుర్తించారు.చెన్నై– బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్‌లో మూడు సొరంగాలు.. మిగతా మార్గం ఎలివేటెడ్‌గా ఉండనుంది. పెరంబూర్, కొలత్తూర్, ఐసీఎఫ్, గ్రాండ్ నార్తర్న్ ట్రంక్ రోడ్డు, పాడి, చెన్నై బైపాస్, తిరువళ్లూరు హైవే, అన్ననూర్, పూందమల్లి, అరక్కోణం ఈ ఎలివేటెడ్ మార్గం సాగుతుంది. అక్కడ నుంచి చిత్తూరు, కోలార్, కోడిహళ్లి, వైట్‌ఫీల్డ్ మీదుగా బెంగళూరులోని బైయప్పనహళ్లి వద్ద ముగుస్తుంది.ఈ హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు వ్యయ అంచనా మొత్తం రూ.18 వేల కోట్లు. అయితే, సవరించిన అలైన్‌మెంట్ స్టడీ రిపోర్ట్‌ను కాంట్రాక్టర్ సమర్పించిన తర్వాత తుది వ్యయం ఖరారవుతుంది. ప్రాజెక్టు కోసం 41 గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. చెన్నై సెంట్రల్ స్టేషన్ వద్ద 1.5 కిలోమీటర్, ఆంధ్రప్రదేశ్‌లోని కౌండిన్య వన్యప్రాణి అభయారణ్యం పరిధిలోని 11.8 కిలోమీటర్లు.. బెంగళూరు అర్బన్ ప్రాంతంలో 14.7 కిలోమీటర్ల మేర సొరంగాలు నిర్మించాలని ప్రతిపాదించారు. మొత్తం 28 కిలోమీటర్లు మేర రైలు భూగర్భంలోనే ప్రయాణిస్తాయి.ఈ కారిడార్‌ను 2035 నాటికి పూర్తి చేయాలనేది అధికారుల అంచనా. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత చెన్నై నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం బెంగళూరు– చెన్నై మధ్య రైల్లో ప్రయాణానికి సుమారుగా 7 గంటల పడుతుండగా.. ఈ కారిడార్‌తో 3 గంటల వరకు సమయం తగ్గనుంది. నిబంధనల ప్రకారం తొలి స్టేషన్ చెన్నై సబర్బన్ స్టేషన్‌కు పశ్చిమంగా ఏర్పాటు కానుంది. అక్కడ నుంచి చెన్నై సెంట్రల్, పక్కనే మెట్రో స్టేషన్‌కు అనుసంధానం అవుతుంది.

# 89 శాతం కూటమి వైపే ఉన్నారా....

విజయవాడ, జూలై 24 ఏపీలో తాజాగా మరోసారి ఐవీఆర్ ఎస్ సర్వే జరిగిందా? ప్రజల అభిప్రాయాలను మరోసారి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారా? వారి అభిప్రాయాలను దూసుకున్నారా? అంటే.. ఔననే అంటున్నారు టీడీపీ నాయకులు. పార్టీ పరంగా కాదు.. ఈ సారి కూడా సర్కారు పరంగానే సర్వే సాగిందని చెబుతున్నారు. పార్టీ వర్గాల కథనం మేరకు.. గత మే–జూన్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది నుంచి ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ప్రధానంగా ఇది సర్కారు విజయంపైనే సాగిందని చెబుతున్నారు. ం మొత్తంగా 5 అంశాలపై ఈ దఫా ఐవీఆర్ ఎస్ సర్వే సాగిందని నాయకులు తెలిపారు. 1) ప్రభుత్వ సంక్షేమ పథకాలు: వీటిపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్న సర్కారు.. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగానే ఇస్తున్నారు. అలాగే.. అన్ని వర్గాలకు కూడా మేలు చేస్తున్నారు. 2) అన్న క్యాంటీన్లు: గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన దీనిని తాజాగా కొనసాగిస్తున్నారు. ఇది అనేక వేల మందికి మేలు చేస్తోంది. 3) పరిపాలన: క్షేత్రస్థాయిలో కార్యాలయాలకు వెళ్లే అవసరాన్ని దాదాపు తప్పిస్తూ..వాట్సాప్ పాలనను తీసుకువచ్చారు 4) గ్రామీణాభివృద్ధి: ప్రస్తుతం గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో భారీ అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం జరుగుతోంది కూడా. ఇలా.. ఈ నాలుగు అంశాలను సర్వేల్లో తీసుకున్నారు. నిజానికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక నాయకుల పనితీరుపై సర్వేలు జరిగినా.. ఇంత విస్తృత స్థాయిలో ప్రభుత్వ పనితీరుపై సర్వే జరగడం ఇదే తొలిసారి అనేది నాయకులు చెబుతున్నారు. ఇక, చివరిగా.. 5వ అంశం.. కూటమి ప్రభుత్వంపై ప్రజల స్పందన. ఇదే అత్యంత కీలకమని చెబుతున్నారు. దీనిపై ప్రజల నుంచి సానుకూల స్పందన లభించింది. వచ్చే ఎన్నికల్లో కూటమిగానే వెళ్లాలని కోరుకుంటున్న వారి సంఖ్య 89 శాతం వరకు ఉందని సర్వేలో స్పష్టమైంది. గత కొన్నాళ్లుగా ఇదే మాట ఇటు నాయకులు కూడా చెబుతున్నారు. కూటమిగా ఉంటేనే మేలు జరుగుతుందని అంటున్నారు. తాజాగా ప్రజల నుంచి కూడా అదే అభిప్రాయం వెల్లడి కావడం గమనార్హం. దీంతో ఇప్పుడు మరింత జోరుగా కూటమి ఐక్యతనే తారకమంత్రంగా పఠించనున్నారు.పార్టీలలో ఎన్ని బేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. కూటమి ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సో.. మొత్తంగా ఇప్పటి కంటే కూడా.. కూటమి ఐక్యతకు ఇక నుంచి మరింత ఇంపార్టెన్స్‌తోపాటు.. మరింతగా కలివిడి తనానికి ప్రభుత్వం పరంగా కూడా ప్రాధాన్యం దక్కనుంది.

### రక్తంతో లేఖ చూసి చాలా బాధపడ్డాను
### ఎమ్మెల్యే మల్లారెడ్డి

సికిందరాబాద్ తనకు బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో రాసిన లేఖపై మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. ఆ లేఖ తనను ఎంతో బాధించిందని, ఆ కార్యకర్త ఎవరో కనుక్కొని తప్పకుండా కలుస్తానని తెలిపారు. శుక్రవారం నాడు బోయిన్పల్లిలో జరిగిన కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి.. తాను ఏ పార్టీలోకీ మారడం లేదని, బీఆర్ఎస్లోనే ఉంటానని మరోసారి స్పష్టం చేశారు.

# ఆపరేషన్ ప్రహార్...

న్యూఢిల్లీ, జూలై 24, (న్యూస్ పల్స్) భారతదేశంలో ఉగ్రవాదం ఎప్పుడూ కొత్త సవాలు కాదు. కశ్మీర్‌లో దశాబ్దాలుగా సరిహద్దు ఆవలి నుంచి ప్రోత్సాహం పొందుతున్న ఉగ్రవాదం, పంజాబ్‌లో ఖలిస్తానీ కార్యకలాపాలు, దండకారణ్యంలో నక్సలిజం ఇవన్నీ దేశ భద్రతకు నిరంతర ముప్పుగా ఉన్నాయి. అయితే ఇటీవలి సంవత్సరాల్లో కశ్మీర్‌లో ఉగ్రవాదం గణనీయంగా అదుపులోకి వచ్చినప్పటికీ, అనంత్‌నాగ్‌లో తాజా కానిస్టేబుల్ హత్య వంటి సంఘటనలు ఇంకా పూర్తిగా నిర్మూలన కాలేదని గుర్తు చేస్తున్నాయి. నక్సలిజాన్ని ఆపరేషన్ కగార్ ద్వారా సమర్థవంతంగా అణచివేసిన అనుభవంతో, కేంద్రం ఇప్పుడు ఉగ్రవాదాన్ని 2029 నాటికి పూర్తిగా అంతం చేసే లక్ష్యంతో ప్రహార్ అనే సమగ్ర వ్యూహాన్ని రూపొందించింది.ఇది పోలీసు, గూఢచార, పరిపాలనా అధికారుల సమన్వయంతో తయారైన ఏడు స్తంభాల వ్యూహం. ఉగ్రవాద ఘటన జరిగిన తర్వాత కాకుండా, మూలాల వద్దనే నెట్‌వర్క్‌ను భగ్నం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. పాకిస్తాన్ నేరుగా కాకుండా కరాచీ ఆధారిత మాఫియా డాన్లు, చిన్న మాడ్యూళ్ల ద్వారా దాడులు చేయాలని ప్రయత్నిస్తున్న నేపథ్యం లో ఈ వ్యూహం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రహార్ ఏడు స్తంభాలు

1. ప్రివెన్షన్

ఉగ్రవాద దాడులు జరగకముందే నిఘా బలోపేతం చేసి, సంబంధాలు ఉన్నవారిని, బాంబు తయారీలో పాల్గొనేవారిని ముందస్తుగా అరెస్టు చేయడం. ఇప్పటికే దేశంలోని 11 రాష్ట్రాల్లో ఇలాంటి కుట్రలను గుర్తించి అరెస్టులు చేశారు. ఇది "ముందస్తు చర్య"పై దృష్టి సారించే కీలక అంశం.

2. ర్యాపిడ్ రెస్పాన్స్

ఏదైనా ఘటన జరిగిన వెంటనే వేగంగా స్పందించడం. అనంత్‌నాగ్ సంఘటన తర్వాత వేల మంది ఓవర్‌గ్రౌండ్ నెట్‌వర్క్ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడం దీనికి ఉదాహరణ. సమయం కోల్పోకుండా దాడి కారకులను గుర్తించి అణచివేయడం.

3. ఏజెన్సీల యూనిటీ

వివిధ భద్రతా ఏజెన్సీలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పనిచేయడం. వాటి సామర్థ్యాలను కలిపి "సినర్జీ" సృష్టించడం ద్వారా సమాచార మార్పిడి, కార్యాచరణ సమర్థత పెరుగుతుంది.

4. హ్యూమన్ రైట్స్

ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేటప్పుడు సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడం. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేక భావాలు లేదా ఉగ్రవాద అనుకూల వైఖరి పెరగకుండా ఉండాలంటే ఈ అంశం అత్యంత కీలకం.

5. అటెన్యూయేటింగ్ కండీషన్స్

ఉగ్రవాదానికి, మతోన్మాదానికి పునాది అయిన జిహాదీ వ్యవస్థలను, ఆలోచనలను నిర్మూలించడం. ఐసిస్ శాఖలు, ఖలిస్తానీ సోషల్ మీడియా ప్రచారం వంటివి ఇందులో భాగం.

6. అలైనింగ్ ఇంటర్నేషనల్ రెస్పాన్స్

అంతర్జాతీయ యాంటీ?టెర్రర్ సంస్థలు, వివిధ దేశాలతో సహకారం పెంచి భారత ఉగ్రవాద వ్యతిరేక పోరును ప్రపంచ స్థాయి ప్రయత్నాలతో అనుసంధానం చేయడం.

7. రికవరీ అండ్ రెసిలియన్స్

దాడి జరిగిన తర్వాత వెంటనే సాధారణ స్థితికి తిరిగి రావడం, సమాజం, భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం.

ఉగ్రవాద పరిధి విస్తరణ

ప్రహార్ కేవలం సంప్రదాయ దాడులకే పరిమితం కాదు. రసాయన, జీవ, రేడియోలాజికల్, అణు, డిజిటల్ ఉగ్రవాదం వంటి ఆరు రకాల ముప్పులను కూడా ఈ వ్యూహం పరిధిలోకి తీసుకొచ్చింది. ఇది ఆధునిక కాలపు సంక్లిష్ట ముప్పులను గుర్తించి సమగ్ర రక్షణ కల్పించే ప్రయత్నం.

అవకాశాలు, సవాళ్లు..

ఆపరేషన్ కగార్ విజయం నక్సలిజం విషయంలో నిరూపించినట్లు, స్పష్టమైన లక్ష్యం, సమన్వయం, నిరంతర పర్యవేక్షణ ఉంటే ఉగ్రవాద నిర్మూలన సాధ్యమే. ప్రహార్ ఈ దిశగా ముందడుగు. ముఖ్యంగా ముందస్తు నివారణ, ఏజెన్సీల సమన్వయం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలు బలంగా ఉన్నాయి. అయితే సవాళ్లు కూడా తక్కువ కావు. సరిహద్దు ఆవలి నుంచి నిరంతరం మారుతున్న మాడ్యూళ్లు, డిజిటల్ ప్రచారం, స్థానిక నెట్‌వర్క్‌లు, మానవ హక్కులు?భద్రత సమతుల్యం ఇవన్నీ నిరంతర శ్రద్ధ అవసరం. ప్రజల విశ్వాసం కోల్పోకుండా చర్యలు తీసుకోవడం, సమాచార యంత్రాంగాన్ని మరింత ఆధునీకరించడం కీలకం.ప్రహార్ వ్యూహం ఉగ్రవాదాన్ని కేవలం దాడుల స్థాయిలో కాకుండా దాని మూలాలు, పోషక వ్యవస్థలు, అంతర్జాతీయ కనెక్షన్లు వరకు విస్తృతంగా ఎదుర్కొనే ప్రయత్నం. 2029 లక్ష్యం సాధించాలంటే ఈ వ్యూహాన్ని నిరంతరం అమలు చేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా మెరుగుపరచుకోవాలి. భారతదేశం ఉగ్రవాద ముక్తంగా మారాలనే లక్ష్యం కేవలం ప్రభుత్వం మాత్రమే కాదు ప్రజలు, సమాజం కూడా భాగస్వాములుగా ఉండాల్సిన జాతీయ కర్తవ్యం.

# అటు జక్కంపూడి... ఇటు భూమన

విజయవాడ, జూలై 24వైసీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. ఒక దళిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారం ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర సంచలనంగా మారింది. సీఐ శేషయ్యను ఉద్దేశించి జక్కంపూడి రాజా అత్యంత అవమానకరమైన మరియు కుల దూషణలతో కూడిన వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై దళిత సంఘాలు మరియు పోలీస్ వర్గాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. కమిషన్ జారీ చేసిన కఠిన ఆదేశాల మేరకు పోలీసులు జక్కంపూడి రాజాపై కేసు నమోదు చేసి, దర్యాప్తును ముమ్మరం చేశారు. కొత్త చట్టం ప్రకారం బిఎన్ఎస్ 351(2) (ఇఔా 351(2)) సెక్షన్‌తో పాటు అత్యంత కఠినమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆయనపై నాన్–బైలబుల్ కేసులు నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా కర్నూలు పోలీసులు రాజమహేంద్రవరానికి చేరుకుని జక్కంపూడి రాజా నివాసంలో ఆయనకు అధికారికంగా నోటీసులు అందజేశారు. ఈ నెల 28వ తేదీన విచారణాధికారి ముందు స్వయంగా హాజరుకావాలని ఆ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. ఒక బాధ్యతాయుతమైన దళిత పోలీస్ అధికారిపై వైసీపీ సీనియర్ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.అయితే, ఆయనపై నమోదైన సెక్షన్లు ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ చట్టం కిందకు రావడం, పైగా నాన్–బైలబుల్ (జామీను లేని) నిబంధనలు ఉండటంతో జక్కంపూడి రాజాకు అరెస్ట్ గండం పొంచి ఉందని తెలుస్తోంది. ఈ నెల 28న జరిగే విచారణలో ఆయన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోయినా, లేదా విచారణకు హాజరుకాకుండా ముఖం చాటేసినా పోలీసులు అతన్ని ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. దీంతో ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో మరింత ఉత్కంఠ రేపుతోంది.

తిరుపతిలో

తిరుపతి జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దర్యాప్తును తీవ్రతరం చేసింది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో ఉన్న విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించారనే ఆరోపణలపై అధికార యంత్రాంగం నిశితంగా విచారణ జరుపుతోంది. నదీ గర్భాన్ని సైతం వదలకుండా పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులపై మలిదశ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.భూమన కరుణాకర్‌రెడ్డి అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని గతంలోనే న్యాయస్థానం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు రెవెన్యూ అధికారులకు (ఎమ్మార్వోలు) జిల్లా కలెక్టర్ అధికారికంగా ఛార్జ్ మెమోలు జారీ చేశారు.కలెక్టర్ నుంచి ఛార్జ్ మెమోలు అందుకున్న వారిలో గతంలో తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)గా పనిచేసిన రామానుజుల నాయక్, ప్రస్తుత తిరుపతి రూరల్ ఎమ్మార్వో జయంత్, అలాగే శ్రీకాళహస్తి ఎమ్మార్వో ఉన్నారు. భూకబ్జాల వ్యవహారంలో గత ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ఉదాసీనంగా వ్యవహరించిన మరికొందరు అధికారుల జాబితాను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

తన ఆస్తులు ధ్వంసం చేసినా తాను వెనక్కి తగ్గబోనని.. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తానని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఈ భూముల వివాదం ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ మాటల యుద్ధానికి దారితీస్తోంది. భూముల యాజమాన్యం, రికార్డులు, ఆక్రమణల అంశాలపై రెవెన్యూ శాఖ విచారణ కొనసాగుతోంది.గత 21 ఏళ్లుగా ముఖ్యమంత్రులుగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ భూములు కనిపించలేదా అని భూమన కరుణాకర్ రెడ్డి ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాను కూటమి ప్రభుత్వ విధానాలపై బలంగా గొంతు ఎత్తుతున్నందుకే ఈ కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను మోసాలు, అవినీతి చేసినవాడ్ని కాదని తేల్చి చెప్పారు. తిరుపతిలో రౌడీ రాజకీయాలకు ఎన్నడూ అవకాశం లేదని.. తన జీవితం అంతా విలువలతో కూడిన రాజకీయాలు చేశానని చెప్పుకొచ్చారు.

1991లో ప్రారంభించిన హెరిటేజ్ సంస్థ కూడా నది పోరంబోకు స్థలంలోనే ఉందని.. తన కుటుంబ ఆస్తులు దాడి చేయడం ద్వారా తనకు మరింత ఉత్సాహం వచ్చిందని.. ఇదే ఉత్సాహంతో కూటమి ప్రభుత్వ తప్పులను ప్రజల ముందు ఉంచుతానని హెచ్చరించారు.ఈ భూ అక్రమాలకు సహకరించిన మిగిలిన అధికారులపై సైతం త్వరలోనే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

రామడుగు మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు తదితరులు తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# 43 లక్షల మంది లిస్ట్ మిస్

విజయవాడ, జూలై 24 రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార కూటమి ప్రభుత్వం సర్ పై కుట్రలు చేస్తోందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున ఓట్ల తొలగిస్తోందని ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు వైసీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు పెట్టింది. ఓటు హక్కును కాలరాసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బూత్ స్థాయి అధికారులను (బీఎల్వో) బెదిరించి ప్రతిపక్షానికి పట్టున్న జిల్లాల్లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లను గల్లంతు చేస్తున్నారని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో 16.38 శాతం ఓట్లు తొలగించారని ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుంది. నిజానికి 14వ తేదీనే సర్ సర్వే ముగియాల్సివుండగా, అధికార, విపక్షాల వినతి మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా పది రోజుల పాటు పొడిగించారు. అయితే మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుండగా, సర్ లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. వైసీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గడువు ముగిసేనాటికి రాష్ట్రంలో మరిన్ని ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆ పార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 43,62,387 ఓట్లు గల్లంతు అయినట్లు వైసీపీ ఆరోపించింది. మొత్తంగా 10.48 శాతం ఓటర్లను తొలగించడంపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎక్కువ ఓట్లు గల్లంతు అయిన జిల్లాల్లో తిరుపతి జిల్లా ఏకంగా 16.38 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వైసీపీ వెల్లడించింది. ఈ జిల్లాలో తమ పార్టీకి ఎక్కువ బలం ఉండటంతోనే ఓట్లను భారీగా తొలగించారని ఆపార్టీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 14.87 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను గుర్తించి తొలగించినట్లు చెబుతుండగా, మరో 13.68 లక్షల మంది శాశ్వత వలసదారుల పేరుతో ఓట్లను తొలగించారని లెక్కలు విడుదల చేసింది.

# జగన్ నెక్స్ట్ ప్లాన్



విజయవాడ, జూలై 24 ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ పెద్దల తలుపులు ఆయన కోసం ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయన ఎప్పుడు దిల్లీ వెళ్లినా ప్రధాని, హోంమంత్రుల అపాయింట్‌మెంట్లు సులువుగా లభించేవి. కానీ, నేడు ఏపీలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమవ్వడమే కాకుండా, కేంద్రంలో ఏపీలోని కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు ఎన్డీఏ లో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ తరుణంలో జగన్ ఢిల్లీ మంత్రాంగం ఆయనకే రివర్స్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల సంయుక్త ఎన్డీఏ ప్రభుత్వం. ఒక రకంగా చెప్పాలంటే మోదీ, అమిత్ షాల నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కీలక భాగస్వాములు. ఇలాంటి సమయంలో, రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడానికి జగన్ వెళ్లి అదే ఎన్డీఏ పెద్దలను కలవాలని చూడటం రాజకీయంగా రివర్స్ అవుతుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన స్వంత కూటమి భాగస్వాములను పక్కనబెట్టి, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి ప్రాధాన్యత ఇస్తుందని భావించడం వ్యూహాత్మక అపరిపక్వతే అవుతుంది. కూటమి ప్రభుత్వంపై మోదీ, షాలకు ఫిర్యాదు చేసినా, దానికి ప్రాధాన్యత లభించకపోగా.. జగన్ రాజకీయంగా మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, అపాయింట్‌మెంట్ల ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాక్షేత్రంలో ఒక్కటే బలమైన ప్రచారం జరుగుతుంది. అదేమిటంటే.. ఆయనపై ఉన్న సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసులు, ఇతర విచారణల నుంచి ఉపశమనం పొందేందుకే ఆయన బీజేపీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారనే భావన. గత ఐదేళ్ల పాటు పార్లమెంట్‌లో ఎన్డీఏకి అవసరమైన ప్రతి బిల్లుకూ ముందూ వెనుక ఆలోచించకుండా బేషరతుగా మద్దతు ప్రకటించిన జగన్, ఇప్పుడు కూడా బీజేపీ గుడ్ లుక్స్ లో ఉండేందుకే తాపత్రయపడుతున్నారని భావిస్తున్నారు. ఈ తరహా పర్యటనలు ఆయన ప్రతిపక్ష నాయకుడిగా సాధించే ప్రజాదరణ కంటే, కేసుల భయంతోనే ఢిల్లీ పెద్దలకు నమస్కరిస్తున్నారు అనే ముద్రను మరింత బలపరుస్తాయి. ఒకపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని, బీజేపీతో కలిసున్న చంద్రబాబు-పవన్ జోడీని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ.. మరోపక్క అదే బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేయడం వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. పార్టీ శ్రేణులు రాష్ట్రంలో కూటమిపై పోరాడాలా లేక ఢిల్లీ స్థాయిలో సంధి ప్రయత్నాలు జరుగుతున్నాయని మౌనంగా ఉండాలా అనే సందిగ్ధంలో పడిపోతున్నాయి. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడి బలం పుంజుకోవాల్సిన సమయంలో, అధినేత పదేపదే ఢిల్లీ పెద్దల ఆశీస్సుల కోసం చూడటం పార్టీ సైద్ధాంతిక స్టాండ్‌నే ప్రశ్నించేలా చేస్తోంది. ఈ భేటీలు ఒకవేళ సాధ్యమైనా, జగన్ రాజకీయంగా సాధించేది ఏమీ ఉండదనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అంచనా. జగన్ ఇస్తే ఒకట్రెండు రాజ్యసభ ఓట్లు తప్ప, లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ బలం నామమాత్రంగా మారింది. అలాంటప్పుడు కేంద్ర పెద్దలు తమ కూటమి భాగస్వామి అయిన చంద్రబాబును కాదని జగన్‌కు రాజకీయ ప్రాధాన్యత లేదా ఊరట ఇస్తారనుకోవడం పొరపాటే. ఈ ప్రతిపాదన వల్ల కూటమి నేతలకు జగన్‌ను ఢిల్లీకి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడే నాయకుడు అని విమర్శించేందుకు అనువైన ఆయుధం దొరికినట్లవుతుంది. ఓ వైపు కేంద్రంపై వ్యతిరేకత పెరుగుతోందన్న వాతావరణం ఏర్పడుతోంది. ఢిల్లీలో కాక్రోచ్‌ల ఉద్యమం ఓ రేంజ్‌కు చేరుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో వైఎస్సార్‌సీపీకి అత్యంత అవసరమైనది ప్రజల్లో ఉండటం, అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్రను పటిష్ఠంగా పోషించడం. ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి హాజరు వేయించుకోవడం వల్ల లేదా వినతిపత్రాలు ఇవ్వడం వల్ల వచ్చే పొలిటికల్ మైలేజ్ శూన్యం. దానికి బదులుగా, ఆ పర్యటనలు తెచ్చే రాజకీయ ప్రతికూలత, పక్షపాత ముద్రలు పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తాయని ఎక్కువ మంది భావిస్తున్నారు. అయితే అపాయింట్మెంట్ లభిస్తే.. బయట ప్రచారం ఉన్నట్లుగా టీడీపీ కంటే ఎక్కువగా వైసీపీకే మోదీ ప్రాధాన్యం ఇస్తారని అనుకుంటారు. కానీ అది కూడా వైసీపీకి ఏ విధంగానూ మేలు చేయదు

# అదిలాబాద్ లో విద్యాసంస్థలు, కళాశాలల బంద్



అదిలాబాద్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ విద్యను బలహీనపరిచే నిర్ణయాలు, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారం, విద్యా రంగంలో ప్రైవేటీకరణను నిరసిస్తూ విద్యాసంస్థలు, కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్యు (ఖఆూజ) అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్, జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒమోఈ నాయకుడు కేశవ్, ఒమోజ నాయకుడు కపిల్, ూఈఎ నాయకుడు ఇసాక్, ఃఖీూ నాయకుడు శివకుమార్, ఒఎజఈ నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొని బంద్‌కు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ ఈ బంద్‌కు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## వ్యక్తి హత్య

బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామంలో ఆతిన శ్రీనివాస్ (58)ను గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి చంపేశారు. సమాచారం అందగానే పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. దీనిపై కేసు నమోదు అయింది. ఇంకొల్లు సీఐ ఎం రామా నాయక్ చినగంజం ఎస్సై ఎస్ రమేష్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# అర్థం కానీ జగన్ వ్యూహం

కడప, జూలై 24 దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పొలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది. ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా కేంద్రంతో లేదా అధికార కూటమితో తలపడటానికి వెనుకాడటం వల్ల పార్టీ మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంటోంది. రాబోయే రోజుల్లోనైనా జగన్ తన రాజకీయ శైలిని మార్చుకుని, ప్రజల్లో ఉండే సమస్యలపై పోరాట బాట పడతారా లేక ఇదే సైలెంట్ స్ట్రాటజీని కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

# లింక్డిన్ లో వైజాగ్ టాప్

విశాఖపట్టణం, జూలై 24 ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది. లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది. అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి.

ఇక రెండో స్థానంలో నిలిచిన లుధియానాలో ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలు, స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తోంది. వడోదరలో కెమికల్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులు వస్తున్నాయి.

విజయవాడలో కూడా ఐటీ, ఈ-గవర్నెన్స్ కంపెనీల నుంచి ఆసక్తి పెరుగుతోంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉన్నాయి. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని లింక్డిన్ చెబుతోంది.

## పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

విశాఖపట్టణం, జూలై 24 సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు. లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS వార్షిక తనిఖీలలో భాగంగా మర్పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించడం జరిగింది.



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 24(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి వార్షిక తనిఖీలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ మరియువికారాబాద్ డీఎస్పీ శ్రీ అంజయ్య బొకేతో ఎస్పీ గారికి స్వాగతం పలికారు.అనంతరం ఎస్పీ గారు పోలీసు అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

తదుపరి "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 91 సీసీటీవీ




కెమెరాలను ప్రారంభించారు. సీసీటీవీల ఏర్పాటు కోసం సహకరించిన మర్పల్లి సర్పంచ్ రమేశ్వర్, పట్లూరు సర్పంచ్ పరుశురాం, కూడుకుంట సర్పంచ్ ప్రవీణ్‌లను శాలువాలతో సత్కరించి అభినందించారు.

అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కేసు ఫైళ్లు, రికార్డులు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, స్టేషన్ నిర్వహణ, మాల్ఖానా, సిబ్బంది సంక్షేమం, పరిశుభ్రత, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని, ప్రజలకు సైబర్ మోసాలపై నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే ఆత్మహత్యల నివారణ (Suicide Prevention)పై గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రజా వేదికల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అదేవిధంగా మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి సత్వర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, నేరాల నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీ అంజయ్య, మొమిన్‌పేట్ సీఐ శ్రీ జి. వెంకట్, మర్పల్లి ఎస్ఐ శ్రీ ఎం.డి. రావుఫ్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు.. మెగా రక్తదాన శిబిరం



**సత్తుపల్లి జులై 24 ప్రజాబలం:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని కిరాణా మర్చంట్స్ కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని పరిశీలించి రక్తదాతలను అభినందించారు.



రక్తదాన శిబిరానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కేటీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరంలో దాదాపు 200 మందికి పైగా రక్తదానం చేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. తలసేమియా బాధితులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమయ్యే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ఈ రక్తాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు పంపిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా వెయ్యి మందికి పైగా పాల్గొన్న భారీ రక్తదాన శిబిరాలను నిర్వహించామని గుర్తు చేశారు. ముఖ్య నాయకుల జన్మదినాలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజానికి ఉపయోగపడటంతో పాటు ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు.

అలాగే ఢిల్లీలో నీట్ విద్యార్థులు గత 20 రోజులుగా నిర్వహిస్తున్న దీక్షపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఇంతకాలంగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా, ఇప్పుడు రాహుల్ గాంధీ అక్కడికి వెళ్లి రాజకీయ డ్రామా చేయడం విడ్డూరంగా ఉందని సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు.

చివరగా రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.






**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** శనివారంనాడు తొలి ఏకాదశికి ముందు రోజు పూజ నిర్వహించే కార్యక్రమం విఠోభ మందిర్ వద్ద విఠలేశ్వర రుక్మిణి రథయాత్ర సందర్భంగా గణేష్ పూజా , గోమాతా పూజా ,ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించడం జరిగినది.
ఈ కార్యక్రమంలో నిర్మల్ కూమార్ యాదవ్ ,కిషన్ యాదవ్ ,శంకర్ యాదవ్ ,రాజు మహారాజ్, గణేష్ యాదవ్ తదితరులు పాల్గోన్నారు.

# రాబోయే ఎన్నికల్లో ఎస్సీ అభ్యర్థులకు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

## భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 24(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/తెలంగాణ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్ సూచన మేరకు,భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు,చంటి ప్రభు,తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో ఎస్సీ అభ్యర్థులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయవలసిందిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ జనాభా ఆధారంగా రాజకీయ రిజర్వేషన్లను అమలు చేసినప్పటికీ, 2026లో కూడా అదే విధానాన్ని కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం ఎస్సీ సమాజానికి తీవ్ర అన్యాయం చేసిందని పేర్కొన్నారు,భారత రాజ్యాంగం సామాజిక న్యాయం, సమానత్వం మరియు బలహీన వర్గాల సాధికారతను ప్రధాన లక్ష్యాలుగా రూపొందించబడిందని గుర్తుచేస్తూ, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు మరియు విద్యాసంస్థల్లో అమలు చేస్తున్న విధానానికి అనుగుణంగా, రాజకీయ రంగంలో కూడా ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు,రాష్ట్రంలోని ఎస్సీ జనాభాకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించాలంటే, 15 శాతం రాజకీయ రిజర్వేషన్ల అమలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. దీనివల్ల దళితుల సమస్యలు ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి మరింత సమర్థవంతంగా చేరుతాయని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సామాజిక న్యాయం సాధించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు,అందువల్ల తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అన్ని ఎన్నికల్లో ఎస్సీలకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ని కోరారు,ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చంటి ప్రభు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ,అశ్వంత్, బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు,ఎల్లయ్య,న్యాయవాది,చంటి దేవిక, న్యాయవాది,కలాలి వినోద్ కుమార్,శివ తదితరులు పాల్గొన్నారు.



# కెటిఆర్ పుట్టినరోజు వేడుకలు

## ఘనంగా నిర్వహించిన బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్.

బి ఆర్ ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మాజీ మంత్రి కె టి ఆర్రి పుట్టినరోజు సందర్భంగా బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలంలోని వికాసం పాఠశాలలో మాజీ ఎంపీపీ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పంద్ర జైవంత్ రావు బి ఆర్ ఎస్ బి ఆర్ ఎస్ వి నాయకులతో కలిసి విద్యార్థిని విద్యార్థులకు బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ.. ప్రజా సేవకు నిర్వచనం, నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు రూపం,ప్రజల నాయకులు కేటీఆర్ గారని తెలిపారు.వారు ఆయు ఆరోగ్యాలతో అష్ట ఐశ్వర్యలతో సుఖ సంతోషాలతో బాగుండాలని ప్రజా సేవలో మరింత ముందు ఉండి ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆజ్మీరా జయ చంద్ర దూట మహేందర్ సిడం సోనే రావు కమేరి రాజు సాజిద్ రాథోడ్ అన్వేష్ జాదవ్ గిరి నాయక్ గౌవాస్కర్ మహేష్ పొన్నం సాయి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా టూర్ పై రసవత్తర చర్చ



హైదరాబాద్, జూలై 24, కేంద్ర మంత్రి బీజేపీకి అన్ని విధాలుగా మార్గదర్శకుడు అయిన అగ్ర నేత అమిత్ షా తాజాగా చేపట్టబోతున్న తెలంగాణా పర్యటన రాజాకీయ వర్గాలలో ఆసక్తిని పెంచుతోంది. ఈ ఆదివారం అంటే 26వ తేదీన అమిత్ షా తెలనగణా పర్యటన పెట్టుకున్నారు. ఈ బీజేపీ అగ్రనేత పర్యటనలో భాగంగా ఒక బీఆర్ఎస్ నాయకుడి కళాశాలను సందర్శించడమే ఇపుడు హాట్ పొలిటికల్ టాపిక్ అయింది. దీంతో అనేక రకాలుగా రాజకీయ ఊహాగానాలకు ఈ పరిణామం తెర లేపింది అని అంటున్నారు. బీఆర్ఎస్ బీజేపీ రెండూ ఒక్కటే అని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేలా అమిత్ షా తాజా టూర్ ఉండబోతోందా అని కూడా ఆలోచిస్తున్నారు ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కి చెందిన కీలక నేత బోయినపల్లి శ్రీనివాసరావుకు ప్రతిమ మెడికల్ కాలేజీ ఉంది. ఈ కాలేజీకి రజతోత్సవ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలుస్తోంది. ఇక అమిత్ షా పర్యటన చూస్తే కేవలం కాలేజ్ ఉత్సవాలకే హైదరాబాద్ వచ్చి మళ్ళీ అటునుంచి అటే ఢిల్లీకి వెళ్ళిపోతున్నారని అంటున్నారు. పైగా అదే కాలేజీలో అమిత్ షా మధ్యాహ్న భోజనం చేస్తారని అంటున్నారు. ఒక విధంగా అమిత్ షా వస్తున్నది బీఆర్ఎస్ నేత కార్యక్రమం వారి ఆతీధ్యం స్వీకరించడానికే కావడంతో తెలంగాణా రాజకీయాలు దీని మీదనే హీటెక్కిపోతున్నాయి.ఇంతకీ ఈ బోయినపల్లి శ్రీనివాసరావు ఎవరు అంటే బీఆర్ఎస్ ఎంపీ బి. వినోద్ కుమార్ కి సోదరుడు అని చెబుతున్నారు అని చెబుతున్నారు. వినోద్ కుమార్ బీఆర్ఎస్ లో అతి ముఖ్య నేత. గతంలో ఎంపీగా పనిచేసిన నాయకుడు. దాంతో పాటు కేసీఆర్ కి సన్నిహిత నేత కావడ మరో విశేషం. మరి అంతటి నేత కుటుంబం నిర్వహించే వైద్య కళాశాల వేడుకకు అమిత్ షా వంటి బీజేపీ ఉద్దండుడు వస్తున్నారు అంటే రాజకీయ సమీకరణలు మలుపు తిప్పే సంఘటనగానే చూస్తున్నారు.ఇక బీజేపీ బీఆర్ఎస్ కలవవు అని ఎన్ని చెప్పినా తెలంగాణా రాజకీయం చూస్తే అది అనివార్యం అనిపిస్తుంది అని రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉంది. విపక్షాలు రెండుగా చీలి 2028లో పోటీకి దిగితే కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీ ఎంత ఉన్నా ఓట్లు అన్నీ అటూ ఇటుగా చీలిపోతాయి. అపుడు కాంగ్రెస్ కే లాభం అని అంటున్నారు. ఈ విషయం రాజకీయంగా ధక్కామెక్కిలు తిన్న బీజేపీకి బీఆర్ఎస్ కి తెలియనిది కాదు కదా అని అంటున్నారు. మరో వైపు చూస్తే బీఆర్ ఎస్ కి ఈసారి ఎన్నికలు చావో రేవో అన్నట్లుగానే ఉంటాయని అంటున్నారు. రెండోసారి వరుసగా ఓటమి పాలు అయితే కనుక బీఆర్ఎస్ ఎన్నడూ లేనంతగా రాజకీయ సంక్షోభంలో పడుతుంది అని అంటున్నారు. అది బీఆర్ఎస్ సమస్య అయితే బీజేపీకి చూస్తే కాంగ్రెస్ ఎక్కడా ఎదగకూడదు అన్నదే గట్టి సంకల్పం అని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ కనుక రాష్ట్రాలలో బలపడి ఎక్కువగా ఎంపీ సీట్లు సాధిస్తే అది జాతీయ స్థాయిలో బీజేపీ అధికారానికి ముప్పు అని అంటున్నారు. అందుకే తాము నేరుగా కట్టడి చేయాల్సిన చోట కట్టడి చేస్తూ లేని చోట్ల మాత్రం మిత్రులను వెతుక్కుని మరీ కాంగ్రెస్ కి బ్రేకులు వేసే వ్యూహాలు బీజేపీ అమలు చేస్తోంది. ఈ విధంగా రాజకీయ విశ్లేషణలు చూసినపుడు బీఆర్ ఎస్ బీజేపీ కలసి పోటీ చేయబోవని అనుకోవడానికి వీలు లేదని అంటున్నారు. అయితే రాజకీయాల్లో వ్యూహాలు అన్నీ సమయానుకూలంగా బయటకు వస్తాయని అంటున్నారు. మరో వైపు చూస్తే బీజేపీ మీద నేరుగా విమర్శలు చేయడాన్ని బీఆర్ఎస్ తగ్గించిందని కూడా విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తం మీద అయితే తెలంగాణాలో అమిత్ షా టూర్ ఆసక్తిని పెంచేస్తోంది.

# ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై - 24, జులై-24, ప్రజాబలం ప్రతినిధి:** గోదావరిఖని (రామగుండం) జనరల్ ఆసుపత్రి లో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనవసరంగా అధిక ఖర్చులు చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుతున్న నాణ్యమైన వైద్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో ప్రస్తుతం నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్య పరికరాలు, అధునాతన నిర్ధారణ సేవలు, ప్రత్యేక వైద్య విభాగాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక ల్యాబొరేటరీ కంప్యూటర్ వ్యవస్థల ద్వారా రక్తం, ఇతర వైద్య పరీక్షల నివేదికలను కేవలం రెండు గంటల్లోనే రూపొందించి రోగుల సెల్‌ఫోన్లకు సందేశాల రూపంలో పంపిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఆధునిక కంప్యూటర్ వ్యవస్థలను జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఆసుపత్రికి సమకూర్చినట్లు పేర్కొన్నారు. దీంతో పరీక్షల ఫలితాల కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా రోగులు వేగవంతమైన సేవలు పొందుతున్నారని తెలిపారు.

గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం అవసరమైన 2డీ ఈకో యంత్రాలను ఒకటి పాత భవనంలో, మరొకటి ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సౌకర్యంతో గుండె పరీక్షల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు పొందే అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

అలాగే ఫిజియోథెరపీ విభాగంలో ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, కీళ్ల నొప్పులు, ఎముకల సమస్యలు, ప్రమాదాల అనంతర పునరావాస చికిత్స అవసరమైన రోగులు గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలోనే ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాత భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆపరేషన్ థియేటర్, ఎక్స్-రే విభాగాన్ని పునరుద్ధరించడంతో పాటు, విభాగాన్ని కొత్త ఎయిర్ కండిషనర్లతో ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వార్డులను పునరుద్ధరిస్తున్నామని పేర్కొన్నారు. పాత భవనం చుట్టూ సీసీ రోడ్ల నిర్మాణం, కాంపౌండ్ గోడ ఎత్తు పెంపు పనులు చేపట్టినట్లు తెలిపారు. మొదటి అంతస్తులోని అన్ని ఆపరేషన్ థియేటర్లు, వార్డుల పునరుద్ధరణతో పాటు ఆప్తాల్మాలజీ (కంటి) ఆపరేషన్ థియేటర్‌ను కూడా ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలోని మార్చురీ పునరుద్ధరణ పనులు కూడా ప్రస్తుతం కొనసాగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, ప్రత్యేక వైద్య సదుపాయాలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నందున ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనవసర ఖర్చులు చేయకుండా ప్రభుత్వ వైద్య సేవలనే వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష పిలుపునిచ్చారు.

## హిమాయత్ నగర్ లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

హైదరాబాద్ ఢిల్లీలో రాహుల్ గాంధీ పై దాడిని, విద్యార్థులపై లాఠీ చార్జీని, అరెస్టులను ఖండిస్తూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హిమాయత్ నగర్ కూడలి నుంచి హైదర్ గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. హిమాయత్ నగర్ వై జంక్షన్ నుండి హైదర్ గూడ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. నీట్ పేపర్ లికేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం అడుతుందని ఆరోపించారు. ప్రశ్న పత్రాలను కాపాడలేని నాయకులు , దేశాన్ని ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యార్థుల డిమాండ్ ను పరిగణలోకి తీసుకుని ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ధర్మేందర్ ప్రధన్ దిష్టిబొమ్మను దహనం చేసారు. పోలీసులు నిరసనకారులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది.

# డిజిటల్ మోసాలపై అప్రమత్తతే అసలైన భద్రత

## -- సి.హెచ్. ప్రతాప్

డిజిటల్ సాంకేతికత మన జీవనాన్ని మరింత సులభతరం చేసింది. బ్యాంకింగ్, బిల్లుల చెల్లింపులు, కొనుగోళ్లు, ప్రభుత్వ సేవలు, పెట్టుబడులు---అన్నీ ఇప్పుడు మొబైల్ ద్వారానే అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ సౌలభ్యంతో పాటు సైబర్ మోసాల ప్రమాదం కూడా వేగంగా పెరుగుతోంది. ప్రతిరోజూ వేలాది మంది మోసగాళ్ల వలలో చిక్కుకుని తమ కష్టార్జిత ధనాన్ని కోల్పోతున్నారు. అందువల్ల ప్రతి పౌరుడి అప్రమత్తతే తొలి రక్షణగా మారింది.

సైబర్ నేరగాళ్లు నిరంతరం కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, కొరియర్ సంస్థలు లేదా ప్రభుత్వ శాఖల ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేయడం, నకిలీ వెబ్‌సైట్లు, సందేశాలు పంపడం, ఉద్యోగాలు, బహుమతులు లేదా అధిక లాభాల పెట్టుబడుల పేరుతో ఆకర్షించడం వంటి ఎత్తుగడలు సాధారణమయ్యాయి. కృత్రిమ మేధస్సు సాయంతో స్వరాలను అనుకరించి కూడా మోసాలకు పాల్పడుతున్నారు.

ఈ ముప్పును ఎదుర్కోవాలంటే ప్రజల్లో సైబర్ అవగాహన పెరగాలి. బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డులు, ఓటీపీలు వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోరాదు. అనుమానాస్పద లింకులు, సందేశాలు, అనువర్తనాలను తెరవకూడదు. ఏవైనా అనుమానాలు తలెత్తితే వెంటనే బ్యాంకు లేదా సైబర్ నేర విభాగాన్ని సంప్రదించాలి.

విద్యాసంస్థలు, కార్యాలయాలు, గ్రామాలు, వార్డుల స్థాయిలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి. వృద్ధులు, విద్యార్థులు, గ్రామీణ ప్రజలు, తొలిసారిగా డిజిటల్ సేవలు వినియోగిస్తున్న వారికి ప్రత్యేక శిక్షణ అందించడం అవసరం.

సాంకేతికతను భయపడాల్సిన అవసరం లేదు. కానీ బాధ్యతతో, జాగ్రత్తగా వినియోగించడం తప్పనిసరి. తాళం వేసిన ఇంటికి దొంగ భయపడినట్లే, అప్రమత్తంగా ఉన్న వినియోగదారుడిని సైబర్ నేరగాడు సులభంగా మోసం చేయలేడు. భద్రమైన డిజిటల్ పౌరసమాజ నిర్మాణంలో ప్రభుత్వ చర్యలతో పాటు ప్రతి పౌరుడి అప్రమత్తత కూడా కీలకం. అందుకే ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే---డిజిటల్ మోసాలపై ప్రజలే మొదటి రక్షణ.

## బిజెపికి నైతిక విలువలు ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను భర్త రఫ్ చేయాలి

### బీ.సీ. ఎస్సీ .ఎస్టి. మైనారిటీ స్టేట్ ప్రెసిడెంట్ ఎం.ఏ. ఖదీర్ డిమాండ్



నల్గొండ జులై 24 : బిజెపికి నైతిక విలువలు ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే పదవీ నుండి భర్త రఫ్ చేయాలి అని బీ.సీ. ఎస్సీ .ఎస్టి. మైనారిటీ స్టేట్ ప్రెసిడెంట్ మరియు జె.ఎ.సి. చైర్మన్ ఎం.ఏ. ఖదీర్ డిమాండ్ చేసారు నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలమయ్యారు అంతేకాకుండా మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలనలో 152 పరీక్ష పత్రాలు లీకయ్యాయి ఇప్పటి కి కూడా ఒకరిని కూడా శిక్షించకపోవడం గమనహరం ఈ నిరంకుశ పరిపాలనలో విద్యార్థు లకు జరిగినటువంటి నష్టాన్ని తల్లిదండ్రులు విద్యార్థులు ఆక్రోషం వ్యక్తం చేస్తున్నారు కావున ఇలాంటి పరీక్షలు లీకేజీలు జరగకుండా భవిష్యత్తులో ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రభుత్వాన్ని మంచి పరిపాలన దిశగా అందించాలని కోరనైనది బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఈ పార్లమెంట్ సమావేశంలో చర్చించి రిజర్వేషన్ ప్రకటించాలని అంతేకాకుండా మహిళలకు 33% రిజర్వేషన్లు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరియు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అంతే కాకుండా నూర్ భాషా దూదేకుల కులాలకు సుదీర్ఘ కాలం నుండి విద్యలో ఉద్యోగాల్లో రాజకీయాల్లో జరుగుతున్నటువంటి అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం గ్రహించి నూర్ భాషా దూదేకుల కులానికి న్యాయం చేయాలని బీ.సీ.ఈ లో చేర్చాలని డిమాండ్ చేసినారు తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులాల వారికి కార్పొరేషన్లు ప్రకటించడం జరిగింది కానీ నూర్ భాషా దూదేకుల కులాన్ని కూడా కార్పొరేషన్లు ప్రకటించవలసిందిగా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

# 180 పోలీసు సిబ్బందికి కంప్యూటర్ పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ తరగతులు..



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 24(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/జిల్లా పోలీసు సిబ్బందిలో వృత్తిరిత్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు వోక్సెన్ యూనివర్సి నిర్వహిస్తున్న రెండవ బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐపిఎస్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తిచేసుకున్న పోలీసు సిబ్బందికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు,ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విస్తృతమవుతున్న నేపథ్యంలో సిబ్బంది ఆధునిక సాఫ్ట్‌వేర్‌లపై పట్టు సాధించడం అత్యంత అవసరమని తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, ముఖ్యంగా వర్డ్, ఎక్సెల్ వంటి సాఫ్ట్‌వేర్‌లలో ప్రావీణ్యం పెరగడం ద్వారా కార్యాలయ పనితీరులో వేగం, ఖచ్చితత్వం, సమర్థత మరింత మెరుగుపడుతుందని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్స్, టెక్ టీమ్ సిబ్బందికి వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు మొత్తం 180 మంది సిబ్బందిని 3 బ్యాచ్‌లుగా విభజించి, ప్రతి బ్యాచ్‌కు 3 రోజుల చొప్పున శిక్షణను అందించడం జరుగుతుంది అన్నారు,శిక్షణలో నేర్చుకున్న అంశాలను రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ పనితీరును మెరుగుపరచుకునేందుకు ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. పోలీసు శాఖలో సేవల నాణ్యతను పెంచడంలో ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు,ఈ సందర్భంగా శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న తొలి బ్యాచ్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. వోక్సెన్ యూనివర్సిటీ యాజమాన్యం, ప్రొఫెసర్లకు పోలీసు శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ డీన్ డా. దయాశంకర్, అసిస్టెంట్ డీన్స్, ప్రొఫెసర్స్, జిల్లా పోలీసు అధికారులు, శిక్షణ పొందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొరిటపాడు సెంటర్లో వెంకటాద్రి లాడ్జిపై టాస్క్ ఫోర్స్ దాడి

### పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు, లాడ్జి యజమాని

గుంటూరు నగరం అరండల్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొరిటపాడు సెంటర్లో ఉన్న వెంకటాద్రి లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంపై, డీఎస్బీ డీఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ-2 పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ బృందం, అరండల్పేట పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. రూమ్ నెం. 204, 304లో పశ్చిమ బెంగాల్కు చెందిన ఇద్దరు మహిళలను గుర్తించి రక్షించారు. లాడ్జి యజమాని శ్రీనివాసరెడ్డిని అదుపులోకి తీసుకుని, మూడు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

దర్యాప్తులో అరండల్పేట శ్రీనగర్కు చెందిన లక్ష్మి వ్యభిచార నిర్వహణలో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ ద్వారా మహిళల ఫోటోలు పంపించడం, లాడ్జి వివరాలు తెలియజేయడం, ఫోన్పే ద్వారా నగదు స్వీకరించడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. దాడి సమయంలో నిర్వాహకురాలు లక్ష్మి పరారీలో ఉండగా, ఆమె కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# డాక్టర్ సురేష్ రామాల జన్మదిన వేడుకలు..

### ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ కార్మికులకు ఉచిత మెగా వైద్య శిబిరం

### 100 మంది ఆటో డ్రైవర్లకు ర4 లక్షల ప్రమాద బీమా ఉచిత ఓపీ సేవలు, యూనిఫాంల పంపిణీ

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 24:** డాక్టర్ సురేష్ రామాల జన్మదినాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో న్యూ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, న్యూ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు, ఆర్టీసీ కార్మికుల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.



ఈ సందర్భంగా 100 మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించారు. అలాగే ఆటో డ్రైవర్ల కుటుంబ సభ్యులందరికీ ప్రతి బుధవారం న్యూ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత ఓపీ సేవలు అందిస్తామని ప్రకటించారు. డాక్టర్ సురేష్ రామాల తన సొంత ఖర్చులతో ఆటో డ్రైవర్లకు యూనిఫాంలను అందజేశారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా బీపీ, షుగర్, చెవి--ముక్కు--గొంతు (ఈఎన్‌టీ) పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. న్యూ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా పేదలు, గ్రామీణ ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ రామాల మాట్లాడుతూ, విజయవాడ, ఖమ్మం, హైదరాబాద్ స్థాయి అత్యాధునిక వైద్య సేవలను సత్తుపల్లిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో న్యూ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటల అత్యవసర సేవలు, అంబులెన్స్, ల్యాబ్, ఐసీయూ, ఆధునిక ఆపరేషన్ థియేటర్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

కార్యక్రమానికి సహకరించిన ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ, న్యూ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# త్రాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ.

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

### అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 24 ప్రజాబలం:** ఎల్నినో దృష్ట్యా జిల్లాలో త్రాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో త్రాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటల అవగాహనపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి, జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామం వారీగా త్రాగునీటి సరఫరాపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. గ్రామాలు మిషన్ భగీరథ నీటిపై ఆధారపడేవి, స్థానిక వనరుల లభ్యతపై స్పష్టంగా స్టడీ చేయాలని, ఏ ఏ వనరులని వాడుకోవచ్చు, ఏ ఏ వనరులను రీ జనరేట్ చేసుకోవచ్చొ చూడాలన్నారు. గ్రామ గ్రామం క్షేత్ర స్థాయిలో సందర్శించి నీటి వనరుల గుర్తింపు చేయాలన్నారు.



గ్రామ సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు, ప్రజాప్రతినిధులతో అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి, ఎల్నినో పరిస్థితులు వివరించి, త్రాగునీటి, సాగునీటి, విద్యుత్ పొదుపుగా వాడడంపై చైతన్యం కల్పించాలన్నారు. వర్షాలు తక్కువగా ఉన్నందున నీటి పొదుపుపై అవగాహన కల్పించి, త్రాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నీటి వనరులలో నీరు వృధా, మళ్లింపు జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలన్నారు. త్రాగునీటిపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని, వచ్చే జూన్, జూలై వరకు దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు.

గ్రామ పంచాయతీ, అంగన్వాడీ, వివో భవనాల నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఫామ్ పాండ్ ల గుర్తింపు చేయాలని, సూచించిన లక్ష్యం మేరకు ఫామ్ పాండ్ ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో ఎస్ఈ ఇర్రిగేషన్ ఎం. వెంకటేశ్వర్లు, ఎస్ఈ మిషన్ భగీరథ శేఖర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మునిసిపల్ కమీషనర్లు, ఎంపిడివో లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే రాగమయి చేతుల మీదగా సిఎంఆర్ఎఫ్ కళ్యాణ లక్ష్మి అందజేత



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 24 :** సత్తుపల్లి మండలం, రూరల్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్), కళ్యాణ లక్ష్మి పథకాల చెక్కులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ కింద 37 మంది లబ్ధిదారులకు రూ.16,18,900 విలువైన చెక్కులు, కళ్యాణ లక్ష్మి పథకం కింద 71 మంది లబ్ధిదారులకు రూ.71,08,236 విలువైన చెక్కులను అందజేశారు. మొత్తంగా 108 మంది లబ్ధిదారులకు రూ.87,27,136 ఆర్థిక సహాయం అందింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందుతుండగా, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణ లక్ష్మి పథకం గొప్ప ఆసరాగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, మున్సిపల్ చైర్మన్ రెహనా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అర్జీ-1 లో క్వార్టర్ల కౌన్సిలింగ్



**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-24, ప్రజాబలం ప్రతినిధి :** రామగుండం ఏరియా-1లో క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహణరామగుండం ఏరియా-1లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల కోసం కేటగిరీ-1 క్వార్టర్ల కౌన్సిలింగ్ శుక్రవారం ఆర్.సి.ఓ.ఏ. క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్లు రవీందర్ రెడ్డి, తిరుపతి పాల్గొని కౌన్సిలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో మొత్తం 318 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, 97 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 24 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకొని స్వీకరించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్వార్టర్ల కేటాయింపు పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు, పర్సనల్ విభాగ అధికారులు, సంక్షేమ విభాగం, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 24(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)జన్మదిన వేడుకలను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు,ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు,ఈ సందర్భంగా మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ నాయకత్వం, కేటీఆర్ కృషి చిరస్మరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇప్పటికీ కేసీఆర్ సేవలు అవసరమని పేర్కొన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రజలు హామీల అమలు కోరితే అసత్య ఆరోపణలు చేస్తూ డైవర్ట్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు,కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర ప్రజల సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజా గొంతుకగా నిలుస్తున్నారని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యలను పక్కనబెట్టి హైడ్రామాలు చేస్తున్నారని, సంగారెడ్డి బైపాస్ రోడ్డు వంటి కీలక సమస్యలను పరిష్కరించకుండా ప్రచారాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు,చింత సాయినాథ్ మాట్లాడుతూలి, సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున కేటీఆర్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ దశ, దిశను మార్చిన కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా మున్సిపల్ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని పట్టణాల సమగ్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, అభివృద్ధి, పరిపాలనలో తనదైన ముద్ర వేసిన నాయకుడు కేటీఆర్ అని అన్నారు,ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ నినాదాలు చేశారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా జన్మదిన వేడుకల్లో పాల్గొని కేటీఆర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, చింత గోపాల్, కొండల్ రెడ్డి, నాగరాజు గౌడ్,రామప్ప, మల్ల గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి,మధుసూదన్ రెడ్డి, విఠల్, పెద్దగొల్ల ఆంజనేయులు, నాయకులు వేణుగోపాల స్వామి, కౌన్సిలర్లు లాడె మల్లేశం, పొన్న రాజేందర్ రెడ్డి, నవీన్, దశరథ్ రెడ్డి, జాఫర్, సురేష్, నాయకులు శ్రీధర్ రెడ్డి, లాడే బాలు, విష్ణువర్ధన్, ఆంజనేయులు, వెంకటేష్ గౌడ్,బీఆర్ఎస్వీ నాయకులు, పార్టీ కార్యకర్తలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మాల్దా బీఎస్ ఎఫ్ క్యాంపులో కాల్పుల కలకలం..

### ఇద్దరు జవాన్లు మృతి

### పోలీసుల అదుపులో ఒకరు

కోల్ కతా పశ్చిమ బెంగాల్ లోని మాల్దా జిల్లా బంగ్లా దేశ్ సరిహద్దు బీఎస్ఎఫ్ క్యాంపులో కాల్పుల కలకలం రేపింది. తోటి జవాన్లపై బీఎస్ఎఫ్ జవాన్ విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో జవాన్కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. కాల్పులకు పాల్పడిన శివమ్ మిశ్రాను అరెస్ట్ చేశారు.

# నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలి


### పుల్కల్ మండలంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విస్తృత పర్యటన కేజీబీవీ, పీహెచ్‌సీ తనిఖీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 24(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**పుల్కల్/విద్యార్థులకు నాణ్యమైన విద్య,సురక్షిత వాతావరణం కల్పించడానికి సంబంధిత అధికారులు సమర్ధవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు,శుక్రవారం కలెక్టర్ పుల్కల్ మండలంలో పర్యటించి మండల కేంద్రంలోనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు,ముందుగా బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు,తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించిన కలెక్టర్, నూతనంగా నిర్మించిన పి హెచ్ సి భవనాన్ని పరిశీలించారు,భవనాన్ని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,త్వరగా మంత్రి చేత ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు,అనంతరం పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణ,డార్మిటరీ,తరగతి గదులు,స్టోర్‌రూమ్,వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఈగలు, దోమలు పెరగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా పరిశుభ్రతను పాటిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు,6వ తరగతి విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్, వారితో పాఠ్యాంశాలను చదివించి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు,విద్యార్థినులకు నోట్‌బుక్‌లను అందజేశారు,లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారికి ఉద్బోధించారు,కలెక్టర్ వెంట ఆయా కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు,ఎంఈఓ,కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,ఇంజనీరింగ్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి...

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 24(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు,అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించి ఆగస్టు నెలాఖరులోగా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు,శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏకరూప దుస్తుల పంపిణీ, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, ఖరీఫ్ పంటల సాగు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు,ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు నెలాఖరులోగా అందజేయాలని సూచించారు. అలాగే ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలాల వారీగా విత్తన మేళాలను నిర్వహించి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు,వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంల కుట్టింపునకు అవసరమైన వస్త్రాలు, ఇతర సామగ్రిని సకాలంలో అందజేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, అవసరమైన యూనిఫాంల వివరాలను అధికారులతో చర్చించారు,జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. క్రాప్ డైవర్సిఫికేషన్‌కు అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు,భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు,సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు క్రియాశీలకంగా వ్యవహరించాలి...

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 24(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు,శుక్రవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ పాండుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 74 శాతం పూర్తయిందని తెలిపారు.నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణతో అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు,ఓటరు జాబితాలో గుర్తించిన అనామలీస్ (వ్యత్యాసాలు) ఉన్న సందర్భాల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు,నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును కొనసాగించుకోవచ్చని తెలిపారు,ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి, బూత్ స్థాయి అధికారుల ద్వారా ఫారాలు సేకరించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు,జిల్లాలో నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి వివరాలను వెల్లడిస్తూ, నారాయణఖేడ్ -- 87 శాతం, ఆందోల్ -- 83 శాతం, జహీరాబాద్ -- 78 శాతం, సంగారెడ్డి -- 74 శాతం, పటాన్‌చెరు -- 58 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు,ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. తమ పరిశీలనలో గుర్తించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు,ఈ సమావేశంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఈఆర్‌వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నూతన గృహాన్ని ప్రారంభించిన రాయల రాము.

### అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు



**ఖమ్మం/తల్లాడ జులై 24 ప్రజాబలం:**తల్లాడ పట్టణానికి చెందిన మైసరావు కృష్ణవేణి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం తల్లాడ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి నియోజకవర్గ బి ఎల్ ఏ ఇంచార్జ్ రాయల రాము పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాయల రాము మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లను జిల్లా మంత్రుల సహకారంతో. సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు తల్లాడ పట్టణానికి వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దగ్గుల శ్రీనివాస్ రెడ్డి,అయినాల నరసింహారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# మర్పల్లి జై భవాని క్లాత్ స్టోర్ లో అదిరిపోయే ఆఫర్స్ అంటున్న ప్రొప్రైటర్ నీలి వెంకట్ రామ్ బ్రదర్స్




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జులై 24 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి టౌన్ లో న్యూ బస్టాండ్ ఎదురుగా జై భవాని క్లాత్ స్టోర్ లో నాణ్యమైన అందమైన ఆహ్లాదకరమైన రూపకల్పనతో టీచింగ్ నాన్ టీచింగ్ వస్త్రాలపై ఆషాడ మాసంలో అదిరిపోయే ఆఫర్స్ ఉన్నాయని ప్రముఖ వ్యాపారవేత ప్రొప్రైటర్ నీలి వెంకట్ రామ్ బ్రదర్స్తెలిపారు ప్రత్యేకమైన కంచు బెనారస్ ఫ్యాన్సీ కలకత్తా సూరత్ ధర్మవరం చైనా ఇలా ప్రత్యేకమైనటువంటి సారీస్ ఎంచుకోబడిన నాణ్యమైన ఆఫర్లతో ఇవ్వడం జరుగుతుంది అలాగే షర్ట్స్ జీన్స్ లెగ్గింగ్స్ అండ్ కాటన్ పాంట్స్ క్లాత్ వస్త్రాలు కోర్పెడ్స్ బెడ్ షీట్స్ ఇలా అనేకమైన వస్త్రాలు అద్భుతమైన నాణ్యమైన ధరలతో సదా మీ సేవలో జై భవాని క్లాత్ స్టోర్ మీ ముందు ఉంటుందని నీలి బ్రదర్స్ తెలిపారు

# రాష్ట్రంలో 51%, కృష్ణా డెల్టాలో 49% వర్షపాతం లోటు

విజయవాడ కృష్ణా డెల్టా నీటి పరిస్థితిపై ఇరిగేషన్ ఈఎన్సీ కే. నరసింహ మూర్తి విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్ లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 51%, కృష్ణా డెల్టాలో 49% వర్షపాతం లోటు నమోదయింది. ఎల్నినో ప్రభావంతో కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గాయి. ఎగువ ప్రాజెక్టుల్లో కుషన్ నీటి కారణంగా శ్రీశైలానికి ప్రవాహాలు తగ్గాయి. ప్రభుత్వం తాగునీటికే తొలి ప్రాధాన్యత ఇచ్చింది. 2027 జూన్ వరకు తాగునీటి అవసరాల కోసం నీటి నిర్వహణ చేసామని అన్నారు.పులిచింతల నీటిని కూడా తాగునీటి అవసరాల కోసం భద్రపరిచారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటి సరఫరా కొనసాగుతోంది. గోదావరిలో ప్రవాహాలు తగ్గడంతో పట్టిసీమ పంపింగ్పై ప్రభావం పడింది సీలేరు నీటి లభ్యత కూడా తగ్గింది. కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం లేదు. పట్టిసీమలో అన్ని పంపులను ఒకేసారి నడపడం సాధ్యం కావడం లేదు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల 60 లక్షల మందికి తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు..ఆర్ఎంసీ నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అనధికారిక పంపుల వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ఎంసీ పరిధిలో ప్రస్తుతం వరి సాగు చేయవద్దని సూచిస్తున్నాం. మధ్యలో నీరు లేక పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాం.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**జహీరాబాద్, జులై 24 ప్రజా బలం ప్రతినిధి:** భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారకరామారావు 50వ జన్మదిన వేడుకలను జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ అందించిన సేవలను కొనియాడుతూ, ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ తంజీం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కమిషనర్ నియామకానికి మొక్కలు నాటి వినతి



**జహీరాబాద్, జులై 24 ప్రజాబలం ప్రతినిధి:** వైద్య విధాన పరిషత్‌కు వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరుతూ జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "మొక్కలు నాటుదాం.. మనవి చేద్దాం" కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రెండు నెలలుగా కమిషనర్ పదవి ఖాళీగా ఉండటంతో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీస్ సంబంధిత సమస్యల పరిష్కారం నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 185 ఆసుపత్రులు, 4 వేల మంది సిబ్బందితో కీలక వైద్య సేవలు అందిస్తున్న వైద్య విధాన పరిషత్‌కు రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం వల్ల పరిపాలనపై ప్రభావం పడుతోందన్నారు.అత్యవసర వైద్య సేవలు అందించే శాఖలో పనిచేస్తున్నందున ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆందోళనలు చేపట్టకుండా, పర్యావరణ పరిరక్షణతో పాటు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. కె. కిరణ్ కుమార్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ వై. మహేష్, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ వెంకటేశం, ఫార్మసీ ఆఫీసర్లు ఎన్. కుమారస్వామి, ఎం. విక్రమ్, ఎం. శ్రీనివాస్, టి. రాజేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ సునంద, హెడ్ నర్స్ వినోద కుమారి, ఎం. లలిత, డి. నిర్మలమ్మతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మణికొండ, నెక్నంపూర్ లో కే.టీ.ఆర్ జన్మదిన వేడుకలు




**గండిపేట ప్రజాబలం ప్రతినిధి 24 జులై 2026**భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం రోజున బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పుట్టిన రోజు వేడుకలు గణనీయంగా జరిగినవని, ఈ సందర్భంగా మణికొండ పైప్ లైన్ రోడ్డులో గల రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆయన ఆయుర్ ఆరోగ్యాలతో విరాజిల్లుతూ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు



చేయాలని పూజలు నిర్వహించడం, తదనంతరమ్ అటు ప్రక్కనే కేక్ కటింగ్ కార్యక్రమం, అన్న ప్రసాద వితరణ జరపడినదని స్థానిక నాయకులు తెలిపారు.

## షాద్‌నగర్‌లో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం ప్రారంభం

**ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**

**ఫీజుల బకాయి బిజెపి లాడాయి పోస్టర్ విడుదల**

షాద్‌నగర్ పట్టణంలోని ఏపీ కాంప్లెక్స్‌లో భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం ప్రారంభమైంది. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజగోపాల్ గౌడ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బీజేపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, శ్రీశైలం, కొప్పు బాషా, కేస్ రత్నం, శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్‌తో పాటు స్థానిక బీజేపీ నాయకులు శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, జిల్లాలో పార్టీ కార్యకలాపాలపై నాయకులు చర్చించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫీజుల బకాయి బిజెపి లాడాయి పోస్టర్ విడుదల చేశారు.

# పరిశ్రమల వ్యర్థ జలాలతో కంపు కొడుతున్న మంజీరా నది

**రానున్న రోజుల్లో మూసి కంటే ప్రమాదకరంగా మారనున్న మాంజీర నది**

**పొల్యూషన్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం**

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 24 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఇప్పటికే పటాన్ చెరువులోని పరిశ్రమల వ్యర్థ జలాలు నక్క వాగు గుండా మంజీర నదిలో కలుస్తుండగా, మంజీరా నది మురికి కుపంల మారింది, తాజాగా శివంపేటలోని బీరు పరిశ్రమ శని శకటంల దాపురించింది, ఇలాంటి పరిస్థితుల్లో మంజీరా నదిని కాపాడే దెల, మంజీరా నది ఉమ్మడి మెదక్ జిల్లాకు వరప్రదాయిని, ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు నిజామాబాద్ రంగారెడ్డి జిల్లాలో సుమారు 1800 వందల గ్రామాలకు తాగునీటిని అందిస్తుంది మంజీరా, అంతేకాక మెదక్ జిల్లా చిట్కుల్ ,చాముండేశ్వరి, ఏడుపాయల, వద్దా భక్తులు పుణ్య స్థానాలు ఆచరిస్తూ ఉంటారు, ఇటువంటి పవిత్రమైన నది ఇప్పుడు కాలుష్య కోరల్లో చిక్కి





విలవిలలాడుతోంది, నన్ను కాపాడండి అంటూ అర్ధనారాలు చేస్తుంది, ఇప్పటికే మంజీరా సింగూరు ప్రాజెక్టులోకి వచ్చేసరికి సగం కాలుష్యం అవుతుంది, అక్కడి నుంచి మంజీరా బ్యారేజ్ కి వచ్చేసరికి, సదాశివపేట ఆరూర్, నంది కందిలో ఉన్న, పరిశ్రమలలో ఉన్న వ్యర్థ జలాలు నదిలో కలుస్తున్నాయి, దీంతో కలప్ గూరులో ఉన్న బ్యారేజ్ లో కలిసే సరికి మరింత కలుషితం అవుతుంది,ఇక పంటాన్ చేరువు,నక్క వాగు గురించి చెప్ప నవసరం లేదు, నక్క వాగులోని రసాయనం పరిశ్రమలు వ్యర్థాలు నదిలో నేరుగా కలుస్తున్నాయి, ఆ వాగు తిన్నగా మాజీరా నదిలో కలవడంతో, పూర్తిగా మూసి మాదిరిగా కంపు కొడుతోంది, తాజాగా చౌటకూర్ మండలం శివంపేట శివారులోని ఓ బీరు పరిశ్రమ, మరీ బరితెగించి వర్షపు నీటి మాటున మోటార్లు పెట్టి వ్యర్తా జలాలను మంజీరా నదిలోకి వదిలేస్తున్నారు, బీరు ఫ్యాక్టరీలో ఒక సంపు ఏర్పాటు చేసి, ఆ సంపు ద్వారా నేరుగా మాంజీరా నదిలోకి వ్యర్థ జనాలను వదలడంతో ఇదివరకే మంజీరా నదిలో చేపలు చనిపోయిన పరిస్థితి ఏర్పడింది, మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు గొర్రెలు మేకలు, బర్రెలు నదిలో నీరు తాపడానికి తీసుకెళ్తే గతంలో మూగజీవాలు మృత్యువాత పడ్డ సంఘటనలు ఎన్ని ఉన్నాయి, ఈ విషయంపై స్థానికులు పొల్యూషన్ బోర్డ్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరించారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బీరు ఫ్యాక్టరీ యొక్క వ్యర్థాలు మంజీరా నదిలో కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు..

# విద్యుత్ ఉచ్చుకు ఎలుగుబంటి బలి.

# ముగ్గురు నిందితుల అరెస్టు.




**ఖమ్మం/తల్లాడ జులై 24 ప్రజాబలం:** తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని లోకారం రిజర్వ్ ఫారెస్ట్‌లో షెడ్యూల్--× కింద అత్యంత రక్షిత వన్యప్రాణి అయిన ఎలుగుబంటిని అక్రమంగా విద్యుత్ ఉచ్చుతో వేటాడిన ఘటనను అటవీ శాఖ ఛేదించింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన అధికారులు, వన్యప్రాణి సంరక్షణ చట్టం--1972తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు వెల్లడించారు.

తల్లాడ ఫారెస్ట్ రేంజ్‌లోని లోకారం రిజర్వ్ ఫారెస్ట్, లోకారం సౌత్ బీట్, కంపార్ట్మెంట్ నంబర్--127లో ఈ నెల 23న విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ అధికారులు తనిఖీలు నిర్వహించగా, ఎలుగుబంటి మృతదేహం కనిపించింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు వెదురు పొదలో సుమారు 2.20 కిలోల బైండింగ్ వైర్ కాయిల్‌ను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం కల్లూరు పశువైద్య సహాయ శస్త్రచికిత్స నిపుణుడితో పోస్టుమార్టం నిర్వహించారు.పోస్టుమార్టం నివేదికతో పాటు ప్రాథమిక దర్యాప్తులో అక్రమంగా విద్యుత్ లైన్లను ఉపయోగించి వేటాడడం వల్ల ఎలుగుబంటి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు నిర్ధారణ అయిందని అధికారులు తెలిపారు. అనంతరం వేగంగా దర్యాప్తు చేపట్టిన అటవీ శాఖ అధికారులు ఈ ఘటనకు బాధ్యులైన అజ్మీరా నాగరాజు, దేవానబోయిన వెంకట నరసింహారావు, అజ్మీరా రమేష్‌లను గుర్తించి అరెస్టు చేశారు.నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం--1972తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి నేడు సత్తుపల్లి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు అటవీ శాఖ వెల్లడించింది. విద్యుత్ లైన్ల ద్వారా వేటాడటం, విషప్రయోగం, ఉచ్చులు ఏర్పాటు చేయడం వంటి వన్యప్రాణి వేటకు సంబంధించిన అక్రమ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించింది. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప అటవీ అధికారులకు సమాచారం అందించి వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరింది.

ఈ తనిఖీలు, దర్యాప్తులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. ఉమ ఆధ్వర్యంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు పి. సురేష్ కుమార్, జి. బాలాజీ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌తో పాటు ఎం.డి. అజాం అలీ, సిద్ధరావు, ఉమా మహేశ్వరరావు, శ్రీకాంత్, భీమా తదితర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

సిర్పూర్ (యూ) మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ చేసి ఒకరికి ఒకరు సీట్లు తింటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు రానున్న రోజుల్లో మన్న బిఆర్ఎస్ ప్రభుత్వం వచుడు కాయమని కేటీఆర్ లాంటి డైనమిక్ లీడర్స్ మా తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అవసరం అని గుర్తు చేస్తూ కేటీఆర్ జన్మదిన సంబరాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తొడసం ధర్మ రావు, స్థానిక సర్పంచ్ ఆత్రం ఓం ప్రకాష్ ,మాజీ సర్పంచ్లు ఆర్క నాగోరావు, పెందోర్ అర్జున్, బిఆర్ఎస్ మండల నాయకులు గేడం యశ్వంత్, మాడవి మానుకు, మెస్రం నరేష్, పవర్ గజానంద్, సోయం రాజు, ఆత్రం విగ్నేష్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో రెండు వారాల 'దీక్షారంభ్--2026' విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం విజయవంతంగా ముగింపు




**హైదరాబాద్, జూలై 24, 2026: (ప్రజాబలం ప్రతినిధి)** ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్ఈ (IFHE), హైదరాబాద్‌లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం జూలై 13 నుండి 24, 2026 వరకు నిర్వహించిన 'దీక్షారంభ్--2026' రెండు వారాల సమగ్ర విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

న్యాయ విద్యకు బలమైన పునాది వేయడం, విశ్వవిద్యాలయ విద్యా విధానం, వృత్తిపరమైన నైతిక విలువలు, న్యాయ సూత్రాలు, పరిశోధనా సంస్కృతి, కెరీర్ అవకాశాలు, విద్యార్థి సహాయ సేవలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ రెండు వారాల పాటు విద్యార్థులు అకాడమిక్ ఉపన్యాసాలు, నిపుణుల ప్రసంగాలు, పరస్పర చర్చా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, సీనియర్ అడ్వకేట్లు, పోలీసు అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, విశ్వవిద్యాలయ పరిపాలనా అధికారులు పాల్గొని సమకాలీన న్యాయ అంశాలు, రాజ్యాంగ విలువలు, వృత్తిపరమైన బాధ్యతలు, నాయకత్వ లక్షణాలు, పర్యావరణ పరిరక్షణ, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నిర్మూలన, కెరీర్ ప్రణాళిక వంటి అంశాలపై విద్యార్థులకు విలువైన మార్గదర్శకత్వం అందించారు.

అలాగే అకాడమిక్ నిబంధనలు, పరీక్షా విధానం, గ్రంథాలయ వనరులు, మూట్ కోర్ట్ కార్యకలాపాలు, లీగల్ ఎయిడ్ కార్యక్రమాలు, వివిధ క్లబ్‌లు, విద్యార్థి సంఘాలు మరియు ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.

జూలై 24న ఐఎఫ్‌హెచ్ఈ క్యాంపస్‌లో నిర్వహించిన ముగింపు (వాలెడిక్టరీ) కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు. అతిథులను వేదికపైకి ఆహ్వానించడంతో కార్యక్రమం




ప్రారంభమైంది.

ఈ సందర్భంగా అధ్యక్ష ప్రసంగం చేసిన ప్రొఫెసర్ (డా.) ఎస్. విజయలక్ష్మి, రిజిస్ట్రార్, ఐఎఫ్‌హెచ్ఈ, హైదరాబాద్, నూతన విద్యార్థులను దేశంలోని ప్రముఖ న్యాయ విద్యాసంస్థలలో ఒకటైన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో చేరినందుకు అభినందించారు. క్రమశిక్షణ, నిబద్ధత, నైతిక విలువలు, విద్యా ప్రతిభ విజయవంతమైన న్యాయవాదిగా ఎదగడానికి మూలస్తంభాలని పేర్కొన్నారు. నిరంతర అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచన, అకాడమిక్ మరియు సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు.

వాలెడిక్టరీ ప్రసంగంలో ప్రొఫెసర్ (డా.) పి. రవిశేఖరరాజు, డైరెక్టర్, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, విద్యార్థులను న్యాయ వృత్తిలోకి ఆహ్వానిస్తూ నిజాయితీ, న్యాయం, వృత్తిపరమైన నిబద్ధత, సామాజిక బాధ్యత వంటి ఉన్నత విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. ఆధునిక న్యాయ వృత్తిలో న్యాయ విజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా నైపుణ్యాలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగే సామర్థ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ అందిస్తున్న అత్యుత్తమ అధ్యాపక బృందం, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుభవాత్మక విద్యా అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ముగింపు వ్యాఖ్యలు చేసిన డా. ఎ. అరుణ్ కుమార్, అసిస్టెంట్ డీన్, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, రెండు వారాల పాటు నిర్వహించిన కార్యక్రమం విజయవంతంగా పూర్తయినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చూపిన ఉత్సాహాన్ని అభినందిస్తూ, న్యాయ విద్యలోకి విద్యార్థులు సులభంగా అడుగుపెట్టేలా, విశ్వవిద్యాలయ జీవనానికి అలవాటు పడేలా ఈ ఓరియంటేషన్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎల్లప్పుడూ క్రమశిక్షణ, జిజ్ఞాస, చొరవతో ముందుకు సాగుతూ సంస్థలో లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మిస్ అన్వేష పాణిగ్రాహి, అకాడమిక్ కోఆర్డినేటర్, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, వోట్ ఆఫ్ థ్యాంక్స్ తెలియజేస్తూ యాజమాన్యం, విశ్వవిద్యాలయ నాయకత్వం, వనరుల వ్యక్తులు, అధ్యాపకులు, పరిపాలనా సిబ్బంది, విద్యార్థి వాలంటీర్లు, కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రెండు వారాల పాటు నిర్వహించిన ఈ ఓరియంటేషన్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు న్యాయ విద్య, వృత్తిపరమైన నైతిక విలువలు, సంస్థ సంస్కృతి, అకాడమిక్ విధానాలు, పరిశోధనా అవకాశాలు, విద్యార్థి సహాయ వ్యవస్థలు, న్యాయ వృత్తిలోని కెరీర్ అవకాశాలపై సమగ్ర అవగాహన పొందారు. అలాగే తమ విద్యా ప్రయాణాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది.

చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగియగా, దీక్షారంభ్--2026 విజయవంతంగా పూర్తయి, నూతన విద్యార్థుల విద్యా ప్రస్థానానికి శుభారంభం పలికింది.

# లోక కళ్యాణార్థం వరుణ యాగం



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఎస్పీ రోడ్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో నేడు దేవాదాయ శాఖ మాత్యులు శ్రీమతి కొండా సురేఖ,ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామ్ అయ్యర్, కమిషనర్ హనుమంతరావు మరియు ఉన్నత అధికారుల సూచన మేరకు లోక కళ్యాణార్థం వరుణ యాగం జరుపబడినది. భక్తుల సమక్షంలో నిర్వహించబడిన ఇట్టి కార్యక్రమంలో కార్యనిర్వాణాధికారి శ్రీనివాసరాజు , ప్రధాన అర్చకులు చింతపట్ల బద్రీనాథ్ చార్యులు, అర్చకులు కరణం మహేష్ శర్మ. వినోద్ కుమార్ ఆచారి, ఫణి కుమార్, విలాస్ కుమార్ జోషి, శ్రీనివాస చార్యులు (పాచక)భజంత్రీలు డి.తారక రాముడు, డి.అనిల్ కుమార్ పాల్గొన్నారు

# జహీరాబాద్ అభివృద్ధికి గడ్కరీని కలిసిన బీఆర్ఎస్ నేతలు

## జాతీయ రహదారులు, ఫ్లైఓవర్, ఆరు లేన్ల విస్తరణకు వినతులు

**జహీరాబాద్, జులై 24 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన కీలక రహదారి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ నేతలు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ శుక్రవారం న్యూఢిల్లీలో గడ్కరీని కలిసి వినతిపత్రాలు





అందజేశారు. జహీరాబాద్--బీదర్ రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి నాలుగు లేన్లుగా విస్తరించాలని, నిమ్జ్, ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధితో ఈ మార్గంలో ట్రాఫిక్ గణనీయంగా పెరిగిందని నేతలు వివరించారు. దీంతో తెలంగాణ--కర్ణాటక రాష్ట్రాల మధ్య రవాణా, అత్యవసర వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అలాగే హైదరాబాద్‌కు ప్రధాన అనుసంధాన మార్గమైన జహీరాబాద్--సంగారెడ్డి ఎన్‌హెచ్-65ను నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలు, భారీ వాహన రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. కోహీర్ మండలం దిగ్వాల్ వద్ద ప్రతిపాదిత ఫ్లైఓవర్/అండర్‌పాస్‌ను 30 మీటర్లకు పొడిగించి, ఇరువైపులా సర్వీస్ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ, బస్ షెల్టర్లు నిర్మించాలని కూడా కోరారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్వీకరించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విధులకు ఆటంకం.. వ్యక్తి అరెస్ట్



**జహీరాబాద్, జులై 24 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తూ అనుమతి లేకుండా ఫోటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆర్ఎంఓ డాక్టర్ ఎం. మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మహ్మద్ చాంద్ పాషాను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలను సోషల్ మీడియా ద్వారా వేధించడం, విధులకు ఆటంకం కలిగించడం, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ఎస్ఐ లవ్‌కుమార్ హెచ్చరించారు.

# నూతన అదనపు కలెక్టర్ ను సన్మానించిన జిల్లా టీఎన్జీవో నాయకులు ...



నాగర్ కర్నూల్ జిల్లాకు నూతనంగా వచ్చిన అదనపు కలెక్టర్ చెన్నయ్య ని నాగర్ కర్నూల్ జిల్లా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావాండ్ల వెంకటేష్ కార్యదర్శి షర్ఫుద్దీన్ కార్యాలయంలో శాలువలతోఘనంగా సన్మానించారు. జిల్లా ప్రజలకు పెరుగైన సేవలు అందించుటలో ఉద్యోగులు తోడ్పాటు కావాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్,కార్యదర్శి షర్ఫుద్దీన్,ఉపాధ్యక్షులు చెన్నకేశవులు,జిల్లా కార్యవర్గ సభ్యులు,నాగర్ కర్నూల్ యూనిట్ అధ్యక్షులు నసిరుద్దీన్,కార్యదర్శి సురేష్ కుమార్,మహిళా నాయకులు అలివేలు,అరుణ,మరియు రామకృష్ణ, సుదర్శన్, బుగ్గప్ప,నాగయ్య,రాకేష్ కన్నా, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడిగా పని చేసి 'మై భారత్' లక్ష్యాలను సాధించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 24:**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన కమిటీలు ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలు, యువజన సంఘాలు, ఇతర భాగస్వాములు ఉమ్మడిగా పని చేసి 'మై భారత్' లక్ష్యాలను సాధించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు.


శుక్రవారం కలెక్టరేట్ విసి హాల్ లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మై భారత్ సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 'మై భారత్' కార్యక్రమాల సమన్వయం, పర్యవేక్షణ మరియు సమర్థవంతమైన అమలును సులభతరం చేయడానికి, మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ ఆమోదంతో జిల్లా సలహా కమిటీ మరియు జిల్లా సమన్వయ కమిటీ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మైభారత్ పోర్టల్ లో 15-29 సంవత్సరాల వయస్సు గల యువతకు స్వచ్ఛంద సేవ, నాయకత్వ అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, ఇంటర్న్‌షిప్‌లు, దేశ నిర్మాణంలో చురుకైన భాగస్వామ్యం కోసం మై భారత్ పోర్టల్ లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మల్కాజిగిరి జిల్లాకు 80,044 మంది యువత రిజిస్ట్రేషన్ ను లక్ష్యంగా నిర్ణయించారన్నారు. కలెక్టరేట్ లోని వివిధ శాఖల వారీగా యువత రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని కేటాయించి నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. మేడ్చల్ లో మై భారత్ నమోదు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేయడానికి సంబంధిత శాఖలు, సంస్థల భాగస్వాముల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. మై భారత్ పోర్టల్‌లో అర్హులైన యువత నమోదును గరిష్ఠ స్థాయికి చేర్చడానికి శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అర్హులైన ప్రతి యువకుడు 'మై భారత్ పోర్టల్'లో నమోదు అయ్యేలా, విద్యాసంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, భారత్ స్కౌట్స్ ఒ గైడ్స్, యూత్ క్లబ్‌లు, స్వయం సహాయక బృందాలు మరియు ఇతర సామాజిక సంస్థల ద్వారా అవగాహన ప్రచారాలు, నమోదు శిబిరాలు విస్తరణ కార్యక్రమాలను నిర్వహించాలని అదనపు కలెక్టర్ అన్ని సంబంధిత శాఖలను ఆదేశించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు, పాఠశాలలు, పురపాలక సంఘాలు గ్రామ పంచాయతీలలో విస్తృత నమోదు శిబిరాలను నిర్వహించాలని, సమీకరణ కోసం ఎన్ఎస్-ఎస్, ఎన్‌సిసి, భారత్ స్కౌట్స్ ఒ గైడ్స్, యూత్ క్లబ్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. 'మై భారత్' పోర్టల్ గురించి విస్తృత అవగాహన కల్పించడానికి గ్రామ సభలు, సామాజిక సమావేశాలు శాఖాపరమైన ప్రచార కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మై భారత్ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా సలహా కమిటీ సభ్య కార్యదర్శి అయిన బి. స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్, మై భారత్ రిజిస్ట్రేషన్ అవగాహన కార్యక్రమం యొక్క లక్ష్యాల గురించి వివరించారు. స్వచ్ఛంద సేవ, నాయకత్వ అభివృద్ధి, పౌర భాగస్వామ్యం మరియు సామాజిక సేవ ద్వారా దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడమే మై భారత్ యొక్క దార్శనికత అని ఆమె వివరించారు.

అనంతరం అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు వికసిత్ భారత్ పోస్టర్ ను ఆవిష్కరించారు.

ఈ సమావేశానికి లీడ్ బ్యాంక్ మేనేజర్ సి. శివ ప్రసాద్; జిల్లా పరిశ్రమల కేంద్రం (డిఐసి) జనరల్ మేనేజర్ డి. వినయ్ కుమార్; జిల్లా యువజన సేవలు క్రీడల ఇన్‌చార్జ్ అధికారిణి రేణుకా దేవి; డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివ రావు; ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డా. ఎం. హరిప్రసాద్ హాజరయ్యారు. డాక్టర్ సాహుల్, ఎన్‌సిసి నోడల్ అధికారి, ఎ.శ్రీలత భారత్ స్కౌట్స్ ఒ గైడ్స్/హిందుస్థాన్ స్కౌట్స్ ఒ గైడ్స్ నోడల్ అధికారి; మోసెస్, కార్యదర్శి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ; ఎం. రాధిక, జిల్లా ఉపాధి అధికారి, నైపుణ్యాభివృద్ధి శాఖ మరియు మైభారత్ ప్రతినిధులు దాసరి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 24:**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

డా. కె. ఆనంద్ గారు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీల నమోదు, తల్లి-శిశు ఆరోగ్య సేవలు, క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమం, ఔషధాల లభ్యత వంటి అంశాలపై ప్రత్యేకంగా పరిశీలించారు.ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న 4వ ఏఎన్‌సీ నమోదు రిజిస్టర్లను పరిశీలించిన డా. ఆనంద్ గారు, గర్భిణీల వివరాలు పూర్తిగా నమోదు చేయాలని, ప్రతి గర్భిణీకి నిర్ణీత సమయానికి అన్ని పరీక్షలు నిర్వహించి నాణ్యమైన గర్భధారణ సేవలు అందించాలని సూచించారు. అలాగే ప్రొఫైళ్లను పరిశీలిస్తూ, ప్రతి గర్భిణీ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గర్భిణీలు మరియు ఇతర లబ్ధిదారుల ఫాలోఅప్ సేవలపై సమీక్ష నిర్వహించిన ఆయన, నమోదైన ప్రతి కేసును క్రమం తప్పకుండా అనుసరించి ఆరోగ్య ఫలితాలు మెరుగుపడేలా చూడాలని ఆదేశించారు.అనంతరం క్షయవ్యాధి కార్యక్రమం కింద రోగుల నుండి తీసుకుంటున్న సమ్మతి పత్రాల నిర్వహణను పరిశీలించి, అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించడంతో పాటు రోగులకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు.తదుపరి ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసిన డా. ఆనంద్, అవసరమైన మందులు తగిన నిల్వలో ఉండేలా చూడాలని, రోగులకు వైద్యుల సూచనల మేరకు మందులు సమయానికి అందించాలని సూచించారు. ఔషధాల నిల్వ, పంపిణీ ప్రక్రియలు పారదర్శకంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని పేర్కొన్న డా. ఆనంద్, ప్రజలకు అందుబాటులో, బాధ్యతాయుతంగా ఆరోగ్య సేవలు అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది కర్తవ్యమని అన్నారు.

## ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకున్న కాంగ్రెస్ పార్టీ

## దళిత మోర్చా మండల అధ్యక్షులు సంటి జితేందర్:

రామడుగు దళిత మోర్చా మండల అధ్యక్షులు సంటి జితేందర్ ఆధ్వర్యంలో ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన తీరు ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను రామడుగు మండల కేంద్రంలో దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ మరియు వారి నాయకులు చేసిన తీరును తప్పు పట్టారు.ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు ప్రదర్శించిన తీరును దేశ ప్రజలంతా గమనించారన్నారు.కాంగ్రెస్ పార్టీ ని దేశంలో ఎవరు నమ్మే స్థితిలో లేరని కేవలం వారి ఉనికి కోసమే ఇటువంటి హేయమైన చర్యలు చేస్తున్నారని వారు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతి రెడ్డి మండల కార్యవర్గ సభ్యులు వేముల రమేష్ వంచ మనోజ్ ఉప సర్పంచ్ బీర్ల వినోద్ నాయకులు పురేళ్ల రాజేశేఖర్ కారుపకల నరేష్ బన్నీ రాకేష్ మణి గంగరాజు రాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ.52.90 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ రాంచంద్రాపూర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. మున్సిపల్ సాధారణ నిధులు రూ. 52.90 లక్షలతో చేపట్టనున్న ఈ సి.సి. రోడ్డు పనులకు నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్.రాహుల్, ప్రియాంక అరెస్టులకు నిరసనగా మర్పల్లిలో కాంగ్రెస్ నాయకులుభారీ ఆందోళన



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జులై 24(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్

అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నానాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీఢిల్లీలో నీట్ వ్యవహారంపై న్యాయం కోరుతూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో మర్పల్లి మండల కేంద్రాన్ని హోరెత్తించారు.మర్పల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని అక్కడి నుంచి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలు, ప్లకార్డులు పట్టుకుని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగడంతో స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పార్లమెంట్ నుంచి ప్రజల మధ్య వరకు నిరంతరం ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం రాజకీయ కక్షసాధింపుకు నిదర్శనమని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తోందని, ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను అణచివేయడం తగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల సమస్యలు, రైతుల ఇబ్బందులు వంటి ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. విద్యార్థులపై కేసులు నమోదు చేయడం, నిరసనలను అణచివేయడం, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలని పేర్కొన్నారు.ధర్నా అనంతరం



కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను కొనసాగించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జ్‌కు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై రాజకీయ వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండించారు. కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించినందుకు వివిధ గ్రామాల నుండి వచ్చిన కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు పేరుపేరునా మర్పల్లిమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు

## యూరప్ అత్యున్నత శిఖరం ఎల్బ్రస్ యాత్రకు జెండా ఊపిన తాడూరి శ్రీనివాస్

## యూరప్ అత్యున్నత శిఖరం అధిరోహణకు మనీష్ యాదవ్ సిద్ధం

## ఎల్బ్రస్ శిఖరంపై త్రివర్ణ పతాకమే లక్ష్యం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 24::** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా నాచారం డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీ కి చెందిన అలుగడ రామ్మోహన్ యాదవ్ కుమారుడు మనీష్ యాదవ్ చేపట్టనున్న యూరప్‌లోని అత్యున్నత పర్వత శిఖరం మౌంట్ ఎల్బ్రస్ (5,642 మీటర్లు) పర్వతారోహణ యాత్రను బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ తార్నాకలో జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్వతారోహణ అనేది కేవలం సాహస క్రీడ మాత్రమే కాకుండా ధైర్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలకు ప్రతీక అని అన్నారు. తెలంగాణ యువత అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ చాటుతూ రాష్ట్రానికి, దేశానికి మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. మనీష్ యాదవ్ మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

మనీష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత సెవెన్ సమ్మిట్స్ లో ఒకటైన మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని అధిరోహించడం తన లక్ష్యమని తెలిపారు. ఈ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి తెలంగాణతో పాటు భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, సాహస క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొని మనీష్ యాదవ్‌కు అభినందనలు తెలుపుతూ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com